RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 302 పేజీలు - 08 శనివారం 26 సెప్టెంబర్ 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక



# తెలంగాణలో 200 కొత్త కోర్టులకు ఆమోదం

**తొలి దశలో అదనపు జూనియర్ సివిల్ న్యాయస్థానాల ఏర్పాటు.. కేసుల భారాన్ని తగ్గించడమే లక్ష్యం**



**తొలి అక్షరం/హైదరాబాద్,సెప్టెంబర్ 25 :** రాష్ట్రంలో పెరుగుతున్న కేసుల భారాన్ని తగ్గించి, ప్రజలకు స్థానికంగానే వేగంగా న్యాయ సేవలు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా తొలి దశలో 200 అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి, అదనపు ప్రథమ శ్రేణి న్యాయ మేజిస్ట్రేట్ న్యాయస్థానాల ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు న్యాయశాఖ కార్యదర్శి బీ. పాపిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. **594 న్యాయస్థానాల అవసరాన్ని గుర్తించిన హైకోర్టు** రాష్ట్రంలో కేసుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో మొత్తం 594 కొత్త న్యాయస్థానాలు, వాటికి అవసరమైన సిబ్బంది, మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ ప్రభుత్వానికి ప్రతిపాదించినట్లు సమాచారం. దీనిపై ప్రభుత్వం స్పందించి తొలి దశగా 200 న్యాయస్థానాలకు అనుమతి మిగతా2లో...

# గంగమ్మ ఒడికి చేరిన ఖైరతాబాద్ గణనాథుడు

**ఘనంగా ఖైరతాబాద్ గణేశుని శోభాయాత్ర**


**భారీ భద్రతా వలయంలో హైదరాబాద్**

**11 రోజుల పాటు భక్తులతో విశేష పూజలందుకున్న ఖైరతాబాద్ గణనాథుడు గంగమ్మ ఒడికి చేరుకున్నాడు. వినాయక నిమజ్జన కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ మహాగణపతిని కడసారి దర్శించుకునేందుకు భక్తులు అశేషంగా తరలివచ్చారు.**

**తొలి అక్షరం/హైదరాబాద్,సెప్టెంబర్ 25 :** అశేష భక్త వాహిని జయజయధ్వానాల మధ్య ఖైరతాబాద్ వినాయకుడి నిమజ్జన కార్యక్రమం అత్యంత వైభవంగా ముగిసింది. 11 రోజుల పాటు భక్తులతో ధూపదీప నైవేద్యాలందుకున్న ఆ గణనాథుడు గంగమ్మ ఒడిని చేరుకున్నాడు. ఈ క్రతువును చూసేందుకు ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో హైదరాబాద్ నగరం జనసంద్రంగా మారింది. తొలుత బాహుబలి క్రేన్‌లో సాంకేతిక లోపంతో బడా గణేశ్ టస్కర్‌పైకి ఆలస్యంగా చేరాడు. ఉదయం 6 గంటలకు ప్రారంభం కావాల్సిన శోభాయాత్ర, క్రేన్‌లో సమస్య కారణంగా 3 గంటల ఆలస్యంగా 9 గంటలకు ప్రారంభమైంది. 'జై బోలో గణేశ్ మహారాజ్ కీ జై' అంటూ భక్తుల జయజయధ్వానాలు మిగతా2లో...

## సీబీఎస్ఈ నూతన చైర్మన్‌గా మందీప్ కే బండారి

**- కేంద్ర మాధ్యమిక విద్యా మండలి నూతన సారథిగా సీనియర్ ఐఏఎస్ అధికారి**




## ఓటు బ్యాంకు రాజకీయాలు కాదు.. సామాజిక మార్పుపై దృష్టి

**సామాజిక సంస్కరణలు, సానుకూల మార్పు కోసం పనిచేయాలి: ప్రధాని మోదీ**



**తొలి అక్షరం/హైదరాబాద్,సెప్టెంబర్ 25 :** ఓటు బ్యాంకు రాజకీయాలపై దృష్టి పెట్టకుండా సామాజిక సంస్కరణలు, సమాజంలో సానుకూల మార్పు కోసం కృషి చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ బీజేపీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం వారణాసి నుంచి వాద్‌నగర్ వరకు కొనసాగుతున్న 'సేవా యాత్ర'లో పాల్గొంటున్న వారితో మిగతా2లో...

## రేవంత్‌రెడ్డికి ఉత్తమ ప్రజాసేవకుడి పురస్కారం

**- రైతులు, వెనుకబడిన వర్గాలు, సామాన్యుల సంక్షేమ పాలనకు గుర్తింపు**




## రాహుల్ గాంధీ బహిరంగ క్షమాపణ చెప్పాలి

**ప్రధాని, హోంమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న కిషన్ రెడ్డి**



**తొలి అక్షరం/హైదరాబాద్,సెప్టెంబర్ 25 :** కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై రాహుల్ గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ ఆయన వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికైన ప్రజాప్రతినిధులపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇతర పార్టీల గుర్తులపై గెలిచిన పలువురు శాసనసభ్యులను మిగతా2లో...



## 'స్టాలిన్ సార్.. నోరు విప్పండి': విజయ్

**వీరమణి వ్యవహారంపై మాజీ ముఖ్యమంత్రిని ప్రశ్నించిన తమిళగ వెట్రి కళగం అధినేత**

**తొలి అక్షరం/హైదరాబాద్,సెప్టెంబర్ 25 :** తమిళనాడులో అధికార డీఎంకే, అన్నాడీఎంకేలపై తమిళగ వెట్రి కళగం అధినేత, ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ విమర్శలు గుప్పించారు. మదురాంతకం శాసనసభ ఉపఎన్నిక ప్రచారంలో భాగంగా శుక్రవారం నిర్వహించిన సభలో ఆయన డీఎంకేను తీవ్రంగా విమర్శిస్తూ, రెండు ద్రవిడ పార్టీల మధ్య రాజకీయ అవగాహన ఉందని ఆరోపించారు.గ్రానైట్ వ్యాపారి మిగతా2లో...

## గ్రామీణ తెలంగాణకు శాశ్వత వసతులే లక్ష్యం

**- తొలి దశలో 7,448 కి.మీ. రహదారుల అభివృద్ధి.. దసరా నాటికి పనులు ప్రారంభించాలి: మంత్రి సీతక్క**



**తొలి అక్షరం/హైదరాబాద్,సెప్టెంబర్ 25 :** గ్రామీణ తెలంగాణలో శాశ్వత మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క అన్నారు. వరంగల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామీణ రహదారుల అభివృద్ధిలో హైబ్రిడ్ వార్షిక చెల్లింపు విధానం కీలకంగా నిలవాలని ఆకాంక్షించారు. తొలి దశలో 7,448 కిలోమీటర్ల మేర రహదారులను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. దసరా నాటికి అన్ని ప్యాకేజీల్లో పనులు ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఆవాసం నుంచి రాష్ట్ర రాజధానికి మెరుగైన రహదారి సౌకర్యం కల్పించడమే లక్ష్యమన్నారు.వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో నీటి భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సీతక్క సూచించారు. ప్రతి జలాశయంలో నీటి మట్టాలను ప్రతిరోజూ పర్యవేక్షించి, ఏడాది తాగునీటి అవసరాలను ముందుగానే నిర్ధారించాలని అన్నారు. మిషన్ భగీరథలో సమస్యలు ఉన్న 86 జనావాసాల్లో నీటి సరఫరాను అత్యవసరంగా పునరుద్ధరించాలని ఆదేశించారు.ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పొలానికి పంట కుంట, ప్రతి గ్రామానికి ఊటకుంట ఉండేలా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. "కూలీకి పని.. మిగతా2లో...

## బ్రహ్మోస్‌తో పాక్‌కు నిద్రలేని రాత్రులు

**- లఖ్నవూలో తయారవుతున్న క్షిపణితో శత్రువులకు భయం: అమిత్ షా**



**తొలి అక్షరం/హైదరాబాద్,సెప్టెంబర్ 25 :** లఖ్నవూలో తయారవుతున్న బ్రహ్మోస్ క్షిపణితో పాకిస్థాన్‌కు నిద్రలేని రాత్రులు వచ్చాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. అమేఠీలో తయారవుతున్న ఏకే203 తుపాకులతో నక్సలైట్లు, ఉగ్రవాదులకు కూడా కంటిమీద కునుకు లేకుండా మిగతా2లో...

# తెలంగాణలో 200 కొత్త కోర్టులకు ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చింది. కొత్త న్యాయస్థానాల ఏర్పాటుతో కేసుల విచారణకు అదనపు సామర్థ్యం ఏర్పడటంతో పాటు న్యాయం కోసం దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు స్థానిక స్థాయిలోనే సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుంది. **రంగారెడ్డికి అత్యధికంగా 30 న్యాయస్థానాలు** కొత్త న్యాయస్థానాల కేటాయింపులో రంగారెడ్డి జిల్లాకు అత్యధికంగా 30 కేటాయించారు. రాజేంద్రనగర్, ఎల్‌బీనగర్, కూకట్‌పల్లి, హయత్‌నగర్, చేవెళ్ల, షాద్‌నగర్, ఆమనగల్, ఇబ్రహీంపట్నం ప్రాంతాల్లో ఇవి ఏర్పాటు కానున్నాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు 25, హైదరాబాద్ నగర పరిధిలోని సిటీ సివిల్, సెషన్స్ న్యాయస్థానాల పరిధికి 16 న్యాయస్థానాలు కేటాయించారు.

ఇతర జిల్లాల్లో నల్గొండకు 10, ఖమ్మం, సంగారెడ్డికి 8 చొప్పున, కరీంనగర్, సూర్యాపేటకు 7 చొప్పున, నిజామాబాద్, జగిత్యాలకు 6 చొప్పున, సిద్దిపేట, మంచిర్యాలకు 5 చొప్పున న్యాయస్థానాలు మంజూరయ్యాయి. వరంగల్, హనుమకొండ జిల్లాలకు కలిపి 12 న్యాయస్థానాలు కేటాయించారు. **ప్రజలకు వేగవంతమైన న్యాయ సేవలపై ఆశలు** కొత్త న్యాయస్థానాల ఏర్పాటు ద్వారా ఇప్పటికే ఉన్న న్యాయస్థానాలపై కేసుల భారం కొంత మేర తగ్గే అవకాశం ఉంది. ముఖ్యంగా చిన్న, సాధారణ స్వభావం గల కేసుల విచారణకు అదనపు న్యాయస్థానాలు అందుబాటులోకి రావడం వల్ల విచారణ ప్రక్రియ మరింత సులభతరం కానుంది. అయితే న్యాయస్థానాల పూర్తి స్థాయి కార్యకలాపాలకు అవసరమైన న్యాయమూర్తులు, సిబ్బంది, భవనాలు, ఇతర మౌలిక వసతుల ఏర్పాటు కూడా కీలకం కానుంది.

# రేవంత్‌రెడ్డికి ఉత్తమ ప్రజాసేవకుడి పురస్కారం

**తొలి అక్షరం/హైదరాబాద్,సెప్టెంబర్ 25 :** తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డికి కేరళకు చెందిన ఆర్యదాన్ మహమ్మద్ ఫౌండేషన్ ప్రతిష్ఠాత్మక 'ఆర్యదాన్ మహమ్మద్2026 ఉత్తమ ప్రజాసేవకుడి పురస్కారం' అందజేసింది. కేరళలోని నిలంబూర్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కే.సీ. వేణుగోపాల్ చేతుల మీదుగా ముఖ్యమంత్రి పురస్కారాన్ని స్వీకరించారు. ఈ పురస్కారం కింద రూ.లక్ష నగదు బహుమతి, ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందించారు. **సంక్షేమ కార్యక్రమాలకు గుర్తింపు** తెలంగాణలో రైతులు, వెనుకబడిన వర్గాలు, సామాన్య ప్రజల సంక్షేమం కోసం చేపట్టిన వినూత్న కార్యక్రమాలు, దూరదృష్టితో కూడిన నాయకత్వాన్ని పరిగణనలోకి తీసుకుని రేవంత్‌రెడ్డిని పురస్కారానికి ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ వర్కింగ్ చైర్మన్, నిలంబూర్ శాసనసభ్యుడు ఆర్యదాన్ షౌకత్ తెలిపారు. ప్రజాస్వామిక విలువల పట్ల ముఖ్యమంత్రి చూపుతున్న నిబద్ధతను ఎంపిక కమిటీ ప్రత్యేకంగా ప్రశంసించినట్లు వెల్లడించారు.

**ముగ్గురితో కూడిన ఎంపిక కమిటీ** పురస్కార ఎంపిక కమిటీలో పార్లమెంట్ సభ్యుడు బెన్నీ బెహనన్, కేరళ రెవెన్యూ శాఖ మంత్రి ఏ.పీ. అనిల్‌కుమార్, ప్రముఖ మేధావి కల్పెట్ట నారాయణన్ ఉన్నారు. ఈ కమిటీ పరిశీలన అనంతరం రేవంత్‌రెడ్డిని పురస్కారానికి ఎంపిక చేసింది.

కేరళకు చెందిన ఈ పురస్కారాన్ని తొలిసారిగా కేరళ వెలుపలికి చెందిన వ్యక్తికి అందిస్తున్నట్లు కార్యక్రమంలో పేర్కొన్నారు. **ఆర్యదాన్ మహమ్మద్ స్మారకార్థం** కేరళకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ మంత్రి ఆర్యదాన్ మహమ్మద్ స్మారకార్థం ఈ పురస్కారాన్ని ఏర్పాటు చేశారు. ఆయన ఎనిమిదిసార్లు శాసనసభ్యుడిగా ఎన్నికై, నాలుగు వేర్వేరు మంత్రివర్గాల్లో మంత్రిగా పనిచేశారు. ప్రజా సంక్షేమం, లౌకిక విలువలు, ప్రజాస్వామిక విధానాల పట్ల ఆయనకున్న నిబద్ధతకు గుర్తింపుగా ఫౌండేషన్ ఈ పురస్కారాన్ని కొనసాగిస్తోంది. ఆర్యదాన్ మహమ్మద్ నాలుగో వర్ధంతి సందర్భంగా నిలంబూర్‌లో ఈ అవార్డు ప్రదాన కార్యక్రమం నిర్వహించారు.

**వేడుకలో రేవంత్‌రెడ్డి ప్రసంగం** పురస్కారం స్వీకరించిన అనంతరం రేవంత్‌రెడ్డి ఆర్యదాన్ మహమ్మద్ ప్రజా జీవితాన్ని స్మరించుకున్నారు. కేరళలో లౌకిక విలువలు, ప్రజాస్వామ్య భావాలకు ఉన్న ప్రాధాన్యాన్ని ప్రస్తావించారు.
పురస్కారాన్ని తన వ్యక్తిగత గౌరవంగా కాకుండా కాంగ్రెస్ కార్యకర్తగా అందుకుంటున్న గుర్తింపుగా పేర్కొన్నారు. కే.సీ. వేణుగోపాల్ ఆర్యదాన్ మహమ్మద్ స్మారక ఉపన్యాసం చేశారు.

# చైనాలో చదువుకోండి.. అమెరికా యువతకు జిన్‌పింగ్ ఆహ్వానం

### ఐదేళ్లలో లక్ష మంది యువతను ఆహ్వానిస్తాం.. విద్య, సాంస్కృతిక మార్పిడితో సంబంధాలు బలోపేతం



**తొలి అక్షరం/హైదరాబాద్,సెప్టెంబర్ 25 :** చైనాఅమెరికా సంబంధాలను ప్రజల స్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కీలక ప్రతిపాదన చేశారు. వచ్చే ఐదేళ్లలో లక్ష మంది అమెరికా యువతను చైనాకు ఆహ్వానించనున్నట్లు ఆయన ప్రకటించారు. విద్య, పర్యటనలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఈ అవకాశాలను కల్పించనున్నట్లు తెలిపారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో కలిసి వాషింగ్టన్‌లో చేసిన సంయుక్త ప్రకటనలో జిన్‌పింగ్ ఈ విషయాన్ని వెల్లడించారు.

**ఇప్పటికే 50 వేల మంది లక్ష్యం పూర్తి** 2023లో తాను ప్రకటించిన 50 వేల మంది అమెరికా యువతను చైనాకు ఆహ్వానించాలన్న లక్ష్యం నిర్ణీత గడువుకు ముందుగానే పూర్తయిందని జిన్‌పింగ్ తెలిపారు. దీనికి కొనసాగింపుగా మరో ఐదేళ్లలో లక్ష మంది యువతను విద్యా, సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాల కోసం ఆహ్వానించనున్నట్లు చెప్పారు. ఇరుదేశాల మధ్య పరస్పర అవగాహన పెరగడానికి యువత మార్పిడి కార్యక్రమాలు ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు.చైనాఅమెరికా సంబంధాల భవిష్యత్తు ఇరు దేశాల ప్రజలపై, ముఖ్యంగా యువతపై ఆధారపడి ఉందని జిన్‌పింగ్ అన్నారు. ప్రజల మధ్య స్నేహం బలపడితే రెండు దేశాల మధ్య సంబంధాలకు మరింత స్థిరమైన పునాది ఏర్పడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. **చారిత్రక సంబంధాలను గుర్తుచేసిన జిన్‌పింగ్** రెండో ప్రపంచ యుద్ధ సమయంలో జపాన్ దురాక్రమణకు వ్యతిరేకంగా చైనా, అమెరికా ప్రజలు కలిసి పోరాడిన విషయాన్ని జిన్‌పింగ్ ప్రస్తావించారు. ఆ చారిత్రక సహకారాన్ని ఇరు దేశాల ప్రజలు గుర్తుంచుకున్నారని చెప్పారు. చైనా తన జాతీయ పునరుజ్జీవన లక్ష్యాలను సాధించడం, అమెరికా తన దేశాన్ని మరింత బలోపేతం చేసుకోవడం రెండూ పరస్పర విరుద్ధమైన లక్ష్యాలు కావని పేర్కొన్నారు.ఇరు దేశాలు ప్రజల ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకుని సహకారాన్ని పెంచుకోవాలని, ప్రజల మధ్య స్నేహాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. ప్రపంచ శాంతి, సుస్థిరతకు ఇరు దేశాల మధ్య స్థిరమైన సంబంధాలు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. **ఉమ్మడి ప్రయోజనాలపై ట్రంప్ దృష్టి** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఇరు దేశాల మధ్య ఉమ్మడి ప్రయోజనాలపై దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో జపాన్‌కు వ్యతిరేకంగా చైనాకు అమెరికా అందించిన సహాయాన్ని గుర్తుచేశారు. భద్రత, సాంకేతికత, కృత్రిమ మేధస్సు వంటి కీలక రంగాల్లో ఇరుదేశాల నాయకులు తీసుకునే నిర్ణయాలు భవిష్యత్ దశాబ్దాల్లో శాంతి, సౌభాగ్యంపై ప్రభావం చూపగలవని అన్నారు.ప్రస్తుతం వాణిజ్యం, సాంకేతికత, భద్రత వంటి అంశాల్లో అమెరికాచైనా మధ్య విభేదాలు కొనసాగుతున్నప్పటికీ, తాజా భేటీలో ఇరు దేశాల మధ్య సంభాషణ, సహకారం కొనసాగించాలనే అంశానికి ప్రాధాన్యం లభించింది. **యువత మార్పిడికి ప్రాధాన్యం** జిన్‌పింగ్ ప్రకటించిన లక్ష మంది యువత ఆహ్వానం ఇరు దేశాల మధ్య విద్యా, సాంస్కృతిక సంబంధాలను ప్రజల స్థాయిలో విస్తరించే ప్రతిపాదనగా నిలిచింది. ప్రభుత్వాల మధ్య చర్చలతో పాటు విద్యార్థులు, యువత, విద్యా సంస్థలు, సాంస్కృతిక వర్గాల మధ్య ప్రత్యక్ష సంబంధాలను పెంచడం ద్వారా పరస్పర అవగాహనను మెరుగుపరచాలన్న ఉద్దేశం ఇందులో కనిపిస్తోంది. తాజా అమెరికా పర్యటనలో జిన్‌పింగ్, ట్రంప్ ద్వైపాక్షిక సంబంధాల భవిష్యత్తుపై చర్చలు జరిపిన నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడింది.

# ఐక్యత చాటిన తెలంగాణ.. ప్రశాంతంగా గణేష్ నిమజ్జనాలు

### రాష్ట్రవ్యాప్తంగా 88 వేల విగ్రహాల నిమజ్జనం.. హైదరాబాద్‌లో 25 వేల మందికిపైగా పోలీసులతో బందోబస్తు




**తొలి అక్షరం/హైదరాబాద్,సెప్టెంబర్ 25 :** తెలంగాణలో గణేష్ నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని డీజీపీ సి.వి. ఆనంద్ తెలిపారు. ప్రజలు సంయమనం, సహకారంతో ఉత్సవాలను నిర్వహిస్తూ రాష్ట్ర ఐక్యతను చాటారని పేర్కొన్నారు. శుక్రవారం డీజీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిమజ్జన ఏర్పాట్లు, భద్రతా చర్యలు, ఇప్పటివరకు పూర్తయిన నిమజ్జనాల వివరాలను వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా గణేష్ ఉత్సవాల కోసం ఏర్పాటు చేసిన విగ్రహాల్లో 1.24 లక్షలు అధికారిక పోర్టల్‌లో నమోదయ్యాయని డీజీపీ తెలిపారు. గతేడాది నమోదైన సంఖ్యతో పోలిస్తే ఈసారి పెరుగుదల నమోదైందన్నా రు. ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, వ్యక్తిగత ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను కలిపితే రాష్ట్రవ్యాప్తంగా మొత్తం సంఖ్య 3.5 నుంచి 4 లక్షల వరకు ఉండే అవకాశం ఉందని వివరించారు. శుక్రవారం ఉదయం వరకు సుమారు 88 వేల విగ్రహాల నిమజ్జనం పూర్తయిందని, మిగిలిన విగ్రహాల నిమజ్జనం శనివారం ఉదయానికి పూర్తయ్యే అవకాశం ఉందని తెలిపారు. **భారీ బందోబస్తు.. సమన్వయంతో ఏర్పాట్లు** హైదరాబాద్‌లో నిమజ్జనోత్సవాల కోసం గత పది రోజులుగా 25 వేల మందికిపైగా పోలీసు సిబ్బందిని బందోబస్తులో వినియోగించినట్లు డీజీపీ తెలిపారు. రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, భద్రత కోసం పోలీసు శాఖతో పాటు వివిధ ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేశాయని చెప్పారు. నిమజ్జన మార్గాలు, వంతెనలు, రహదారులను ముందుగానే పరిశీలించి అవసరమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. **శోభాయాత్రలకు కొంత ఆలస్యం** శుక్రవారం కావడంతో మతపరమైన అంశాలను గౌరవిస్తూ హైదరాబాద్‌లో కొన్ని శోభాయాత్రలు మధ్యాహ్నం కొంత ఆలస్యంగా ప్రారంభమయ్యాయని ఆనంద్ వివరించారు. దీంతో కొన్ని ప్రాంతాల్లో నిమజ్జన ప్రక్రియ కూడా ఆలస్యంగా కొనసాగుతోందన్నారు. ముఖ్యంగా హైదరాబాద్‌లో భారీ సంఖ్యలో విగ్రహాలు ఒకేసారి నిమజ్జనానికి తరలివస్తుండటంతో సమయం పడుతోందని తెలిపారు. అయినప్పటికీ ప్రజలు, ఉత్సవ కమిటీలు, పోలీసులు పరస్పరం సహకరించుకో వడంతో నిమజ్జనాలు ప్రశాంతంగా కొనసాగుతు న్నాయని పేర్కొన్నారు.గణేష్ ఉత్సవాల ప్రారంభం నుంచే భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టిన పోలీసు శాఖ.. విగ్రహాల వివరాలను నమోదు చేయ డం, నిమజ్జన మార్గాలను ముందస్తుగా గుర్తించడం, రద్దీ ప్రాంతాలను పర్యవేక్షించడం వంటి చర్యలు చేపట్టింది.

# గంగమ్మ ఒడికి చేరిన ఖైరతాబాద్ గణనాథుడు

(మొదటి పేజీ తరువాయి)

మార్మోగాయి. అశేష భక్తజనావళి నినాదాల మధ్య ఆ గణనాథుడు గంగమ్మ ఒడిని చేరాడుబడా గణేశ్ శోభాయాత్ర ఆద్యంతం కన్నుల పండువగా సాగింది. భక్తుల కోలాహలం మధ్య సంప్రదాయ మేళతాళాలతో ఖైరతాబాద్ గణేశుడి శోభాయాత్ర ట్యాంక్‌బండ్ క్రేన్ 4 వద్దకు చేరుకుంది. భక్తులు గణనాథుడిపైకి పుష్పాలు చల్లుతూ, డోలు వాయిస్తూ శోభాయాత్రలో పాల్గొన్నారు. ఆ గణనాథుని కడసారి చూసేందుకు జనం తండోపతండాలుగా తరలివచ్చారు. దారి పొడవునా జై బోలో గణేశ్ మహరాజ్ కీ అంటూ నీరాజనాలు పలికారు. సెన్సేషన్ థియేటర్, టెలిఫోన్ భవన్, తెలుగు తల్లి ఫ్లైఓవర్ పక్క నుంచి సచివాలయం మీదుగా సాగర తీరానికి గణేశుడు చేరుకున్నాడు. నిమజ్జనాల సందర్భంగా హైదరాబాద్‌లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.గణేశ్ నిమజ్జనాల సందర్భంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు చర్యలు చేపట్టారు. నగరాన్ని భారీ భద్రతా వలయంలోకి తీసుకొచ్చారు. 20 వేల మందికి పైగా సిబ్బందితో పాటు కేంద్ర బలగాలను రంగంలోకి దించారు. ఇక మహా నిమజ్జన శోభాయాత్రను క్షణక్షణం పర్యవేక్షించేందుకు హైదరాబాద్ సిటీ పోలీస్ అత్యాధునిక సాంకేతికతను వినియోగించింది. 10 వేల సీసీ కెమెరాలు, 24 డ్రోన్లు, హైరైజ్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసింది.

# సీబీఎస్ఈ నూతన చైర్మన్‌గా మందీప్ కే బండారి

**తొలి అక్షరం/హైదరాబాద్,సెప్టెంబర్ 25 :** కేంద్ర మాధ్యమిక విద్యా మండలి నూతన చైర్మన్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి మందీప్ కే బండారి నియమితులయ్యారు. ఆయన నియామకానికి కేబినెట్ నియామకాల కమిటీ శుక్రవారం ఆమోదం తెలిపింది. ఇటీవల పరీక్షల నిర్వహణ, తెరపై మార్కుల నమోదుకు సంబంధించి విమర్శలు ఎదుర్కొన్న కేంద్ర మాధ్యమిక విద్యా మండలికి ఆయన సారథ్యం వహించనున్నారు.మందీప్ కే బండారి 2001 బ్యాచ్‌కు చెందిన అగ్ముట్ కేడర్ ఐఏఎస్ అధికారి. వైద్య విద్యలో పట్టా పొందిన ఆయన ఎంబీబీఎస్‌లో స్వర్ణ పతకం సాధించారు. రెండు దశాబ్దాలకు పైగా పరిపాలనా రంగంలో సేవలందించిన ఆయన, ఇకపై విద్యా వ్యవస్థలో సంస్కరణ లు, పరీక్షల నిర్వహణ తదితర అంశాలపై దృష్టి సారించనున్నారు. చైర్మన్ పదవిని తాత్కాలికంగా అదనపు కార్యదర్శి స్థాయికి మార్చడంతో ఆయనకు అదే స్థాయి వేతన, భత్యాలు వర్తించనున్నాయి.

# ఓటు బ్యాంకు రాజకీయాలు కాదు.. సామాజిక మార్పుపై దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

దృశ్య మాధ్యమం ద్వారా మాట్లాడారు.గత 12 ఏళ్లలో నగరాలు, గ్రామాల మధ్య అంతరం గణనీయంగా తగ్గిందని, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగుపడ్డాయని మోదీ పేర్కొన్నారు. మహిళల స్వావలంబన కూడా పెరిగిందన్నారు. మహాత్మా గాంధీ స్వాతంత్ర్య పోరాటంతో పాటు సామాజిక సంస్కరణల కోసం కృషి చేశారని గుర్తుచేశారు.ప్రయాగ్‌రాజ్‌లో పారిశుద్ధ్య పనులు చేపట్టిన వారి సేవలను ప్రధాని ప్రశంసించారు. వారి కృషితో కుంభమేళాకు పారిశుద్ధ్య నిర్వహణలో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించిందన్నారు. సమాజానికి సేవ చేసేవారికి తగిన గౌరవం దక్కాలని, సేవా యాత్ర తన జీవితంలో ఎంతో ప్రాధాన్యమైనదని మోదీ పేర్కొన్నారు.

# 'స్టాలిన్ సార్.. నోరు విప్పండి': విజయ్

(మొదటి పేజీ తరువాయి)

ఆర్. వీరమణికి సంబంధించిన బాలలపై లైంగిక నేరాల నిరోధక చట్టం కేసును విజయ్ ప్రస్తావించారు. గత డీఎంకే ప్రభుత్వ హయాంలోనే కేసు నమోదైనప్పటికీ దర్యాప్తు తీరుపై ప్రశ్నలు తలెత్తాయని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్‌ను ఉద్దేశించి 'స్టాలిన్ సార్.. నోరు విప్పండి' అని ప్రశ్నించారు.కేసులో పోలీసులు తొలుత దర్యాప్తు ముగించేందుకు నివేదిక సమర్పించగా, ప్రత్యేక న్యాయస్థానం దానిని తిరస్కరించి తదుపరి దర్యాప్తుకు ఆదేశించింది. అనంతరం వీరమణితో పాటు మరికొందరిని పోలీసులు అరెస్టు చేశారు. అయితే, గత ప్రభుత్వం ఎవరినీ కాపాడేందుకు ప్రయత్నించలేదని స్టాలిన్ స్పష్టం చేశారు. తన ప్రభుత్వంపై వస్తున్న ఆరోపణలు అసత్యమైనవని ఆయన పేర్కొన్నారు.

# బ్రహ్మోస్‌తో పాక్‌కు నిద్రలేని రాత్రులు

(మొదటి పేజీ తరువాయి)

పోయిందని పేర్కొన్నారు. గ్రేటర్ నోయిడాలో ఉత్తరప్రదేశ్ వాణిజ్య ప్రదర్శన ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు.ఉత్తరప్రదేశ్ రక్షణ పారిశ్రామిక మార్గంలో ఝాన్సీ, చిత్రకూట్, లఖ్నవూ, ఆగ్రా, అలీగఢ్, కాన్పూర్ ప్రాంతాల్లో పెట్టుబడులు వస్తున్నాయని అమిత్ షా తెలిపారు. అంతర్జాతీయంగా ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ భారత్ ఆర్థికంగా పురోగమిస్తోందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో వివిధ దేశాలతో పలు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదిరాయని పేర్కొన్నారు.

# రాహుల్ గాంధీ బహిరంగ క్షమాపణ చెప్పాలి

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్‌లో చేర్చుకున్నారని కిషన్ రెడ్డి ఆరోపించారు.
దానం నాగేందర్ విషయంలో సుప్రీంకోర్టు అనర్హత వేటు నేపథ్యంలో కాంగ్రెస్ నేతలు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఈ అంశాలపై రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నాయకత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# గ్రామీణ తెలంగాణకు శాశ్వత వసతులే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

గ్రామానికి శాశ్వత ఆస్తి" అనే లక్ష్యంతో ఉపాధి పనులు చేపట్టాలని తెలిపారు.
అక్టోబర్ 2న జరిగే గ్రామసభల్లో వచ్చే ఏడాది చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ప్రజలతో చర్చించి ఆమోదించాలని అధికారులకు సూచించారు.

# హైదరాబాద్‌లో రాపిడో ఫుడ్ డెలివరీ సేవలు




**తొలి అక్షరం/హైదరాబాద్,సెప్టెంబర్ 25 :** బెంగళూరు తర్వాత రాపిడో సంస్థ తన ఓన్లీ ఫుడ్ డెలివరీ సేవలను హైదరాబాద్‌లోకి విస్తరించింది. ఇది జీరో కమిషన్ మోడల్‌పై పని చేస్తోంది. దీని సహ వ్యవస్థాపకుడు అరవింద్ శంకర్ మాట్లాడుతూ, హైదరాబాద్ గొప్ప ఫుడ్ నగరమని, కస్టమర్లకు నిజమైన ధరలకే ఆహారం అందిస్తామని తెలిపారు. ఈ యాప్ ద్వారా రెస్టారెంట్లకు ఎలాంటి కమిషన్ భారం ఉండదని, ప్రస్తుతం ఇది 20 వేలకు పైగా రెస్టారెంట్లతో భాగస్వామ్యం కలిగి ఉందని కంపెనీ వెల్లడించింది.

# నేలపట్లలో 5K వాకింగ్ రన్నింగ్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్

**- యువత ఆరోగ్యమే లక్ష్యంగా సెప్టెంబర్ 27న ప్రత్యేక కార్యక్రమం**



**తొలి అక్షరం/చౌటుప్పల్. సెప్టెంబర్ 25:** యువతలో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు శారీరక దృఢత్వంపై చైతన్యం కల్పించే ఉద్దేశంతో నేలపట్ల గ్రామంలో 5K వాకింగ్ & రన్నింగ్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.సెప్టెంబర్ 27, 2026 ఆదివారం ఉదయం 6 గంటలకు రాయల్ గార్డెన్ వద్ద దబ్బేటి రాములు గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. కార్యక్రమానికి చౌటుప్పల్ డీఎస్పీ శ్రీ మస్సుదన్ రెడ్డి, చౌటుప్పల్ సీఐ శ్రీ మన్మథ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారు.యువతతో పాటు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని 5ఖ వాకింగ్‌రన్నింగ్‌ను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

# యువత భవిష్యత్తుకు 'ఆసరా'

**- 50కి పైగా కంపెనీలతో మెగా ఉద్యోగ మేళా**




**తొలి అక్షరం/చౌటుప్పల్. సెప్టెంబర్ 25:** నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఆసరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 27న మెగా ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ బొల్ల శివశంకర్ తెలిపారు.చౌటుప్పల్ మండలం తంగడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మేళా జరుగుతుందని చెప్పారు. 50కి పైగా కంపెనీలు పాల్గొని వివిధ రంగాల్లో ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువత విద్యార్హతల ధ్రువపత్రాలతో హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ఎన్నికల హామీకి ఆచరణ రూపం.. వృద్ధుడికి సర్పంచ్ అండ!

**- పింఛన్ వచ్చే వరకు వృద్ధుడికి నెలకు రూ.1,500 ఆర్థిక సాయం చేస్తున్న పంతంగి సర్పంచ్ కాకి శ్రీలత సుందర్**



**తొలి అక్షరం/చౌటుప్పల్ సెప్టెంబర్ 25:** చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామం లో సర్పంచ్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ పంతంగి గ్రామ సర్పంచ్ కాకి శ్రీలత సుందర్ మానవతా దృక్పథంతో వృద్ధుడికి అండగా నిలుస్తున్నారు.పంతంగి గ్రామానికి చెందిన బర్మ జంగయ్య (75) వృద్ధాప్యంలో జీవనం సాగిస్తున్నారు. ఆయన భార్యతో పాటు ఇద్దరు కుమారులు కూడా మృతి చెందడంతో ప్రస్తుతం ఒంటరిగా జీవిస్తున్నారు. ప్రభుత్వ పింఛన్ రావాల్సి ఉన్నప్పటికీ ఇప్పటివరకు పింఛన్ అందకపోవడంతో జంగయ్య ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని సర్పంచ్ ఎన్నికల సమయంలో "ప్రభుత్వ పింఛన్ వచ్చే వరకు ప్రతినెలా రూ.1,500 చొప్పున వ్యక్తిగతంగా ఆర్థిక సాయం అందిస్తాను" అని ఇచ్చిన హామీ మేరకు కాకి శ్రీలత సుందర్ ప్రతి నెలా సహాయం అందిస్తున్నారు.ఇందులో భాగంగా నాలుగో నెలకు సంబంధించిన రూ.1,500 ఆర్థిక సాయాన్ని కూడా ఈరోజు అందించారు. ప్రభుత్వ పింఛన్ అందే వరకు ఈ సహాయాన్ని కొనసాగిస్తానని సర్పంచ్ తెలిపారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను ఆచరణలో పెట్టి, వృద్ధుడికి అండగా నిలుస్తూ మానవత్వాన్ని చాటుతున్న కాకి శ్రీలత సుందర్‌ను గ్రామ ప్రజలు అభినందించారు. ప్రజా ప్రతినిధిగా హామీ ఇవ్వడమే కాకుండా, ఆ హామీని నిరంతరం అమలు చేయడం అభినందనీయమని గ్రామస్థులు పేర్కొన్నారు.

# కమ్యూనిటీ స్థలం కబ్జా ఆరోపణలు అవాస్తవం

**- అధికారులకు ఫిర్యాదు చేసిన వెంకటరెడ్డి, రాంరెడ్డి**



**తొలి అక్షరం/చౌటుప్పల్ సెప్టెంబర్ 25:** కంచరకుంట్ల కాలనీలో కమ్యూనిటీ స్థలాన్ని కబ్జా చేశామంటూ వస్తున్న ఆరోపణలు అవాస్తవమని కంచరకుంట్ల వెంకటరెడ్డి ఖండించారు. తన పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన పట్టా భూమిని మాత్రమే విక్రయించానని, కమ్యూనిటీ హాల్ కోసం కేటాయించిన స్థలాన్ని ఆక్రమించలేదని తెలిపారు.తమపై ఆధారాలు లేకుండా తప్పుడు



ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మోగదాల పావని రమేష్, కమిషనర్ వెంకటేశ్వర నాయక్‌కు వెంకటరెడ్డి, రాంరెడ్డి ఫిర్యాదు చేశారు. అలాగే తప్పుడు సర్వే నంబర్లతో ప్లాట్లు ఏర్పాటు చేసి విక్రయించేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై విచారణ జరిపి, అక్రమ రిజిస్ట్రేషన్లను నిలిపివేయాలని కోరారు.

# త్రినిటీ విద్యార్థుల హ్యాండ్‌బాల్ హవా!

**- ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో సత్తా.. రాష్ట్రస్థాయి పోటీలకు ఆరుగురు క్రీడాకారుల ఎంపిక**




**తొలి అక్షరం/చౌటుప్పల్: సెప్టెంబర్ 25:** చౌటుప్పల్ పట్టణంలోని త్రినిటీ పాఠశాల విద్యార్థులు హ్యాండ్‌బాల్ క్రీడలో అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కట్టంగూర్ మండలం చెరువు అన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఎస్జీఎఫ్ ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో త్రినిటీ పాఠశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటారు.రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారుల్లో అండర్14 బాలికల విభాగంలో జి. ప్రేక్షక, కె. ఆకాంక్ష, అండర్14 బాలుర విభాగంలో పి. జ్ఞానేశ్, సూర్య ప్రకాష్, అండర్17 బాలుర విభాగంలో బి. పవన్ కుమార్, అండర్17 బాలికల విభాగంలో జి. హర్షిత ఉన్నారు.ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ కె.వి.బి. కృష్ణారావు, ప్రిన్సిపల్ అండ్ డైరెక్టర్ ఉజ్జిని మంజుల మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం పాఠశాలకు గర్వకారణమని అన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ఇదే స్ఫూర్తితో ప్రతిభ కనబరిచి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు సందీప్, నందినిలను చైర్మన్ కృష్ణారావు, ప్రిన్సిపల్ మంజుల అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

# ఖమ్మం శ్రీమంత హాస్పిటల్‌లో జిల్లా వైద్యా, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి రామారావు ఆకస్మిక తనిఖీ

**తొలి అక్షరం/ఖమ్మంజిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 25:** ఖమ్మం పట్టణంలోని శ్రీమంతా హాస్పిటల్, సాయి మారుతి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ల ను, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి రామారావు సందర్శించినారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, హాస్పిటల్‌లో అందిస్తున్న వైద్య సేవలు, వైద్యులు మరియు సిబ్బంది హాజరు, రోగులకు అందుతున్న చికిత్సా విధానం, ఆసుపత్రి నిర్వహణ, రిజిస్టర్లు మరియు సంబంధిత రికార్డులను పరిశీలించారు. అదేవిధంగా ఆసుపత్రిలోని వివిధ విభాగాలు, వార్డులు, ప్రయోగశాల, ఫార్మసీ తదితర విభాగాలను పరిశీలించి, అవసరమైన వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.హాస్పిటల్‌లో Clinical Establishments Act, 2010 మరియు సంబంధిత నిబంధనల ప్రకారం అవసరమైన రికార్డులు, అనుమతులు, వైద్యులు మరియు



పారామెడికల్ సిబ్బంది అర్హత ధ్రువపత్రాలు, రిజిస్ట్రేషన్ వివరాలు అందుబాటులో ఉండేలా చూడాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి సూచించారు.రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు, ఆసుపత్రి పరిసరాల్లో పరిశుభ్రత, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, రోగుల భద్రత మరియు ప్రజారోగ్య ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఆయన సూచించారు. అదేవిధంగా ప్రజలకు అందించే వైద్య సేవల్లో నాణ్యతా ప్రమాణాలు, పారదర్శకత మరియు రోగుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని డాక్టర్ డి. రామారావు తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించినట్లు గుర్తించిన పక్షంలో సంబంధిత చట్టాలు మరియు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బిందు శ్రీ, డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, డాక్టర్ మోతియా, డాక్టర్ ఐ మూర్తి, జూనియర్ అసిస్టెంట్ రాజేందర్, డీఈవో రాజేష్ మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీరాశీపురం తండా ఎంపీపీఎస్‌ను సందర్శించిన ఏన్కూర్ ప్రత్యేక అధికారి



**తొలి అక్షరం/ ఏన్కూర్ సెప్టెంబర్ 25:** మండల ప్రత్యేక అధికారి ఎం.డి. ముజాహిద్దీన్ శుక్రవారం ఎంపీపీఎస్, శ్రీరాంపురం తండా పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు, విద్యాబోధన, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు.పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, మౌలిక వసతులను పరిశీలించి ఉపాధ్యాయులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## నూతన ఫ్లెక్సీ ప్రింటింగ్ షాప్ ని ప్రారంభించిన బి ఆర్ యస్ పార్టీ నాయకులు



**తొలి అక్షరం/ నెక్కొండ సెప్టెంబర్ 25:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో వెంకటాపురం గ్రామానికి చెందిన ఏకాంబరం గారు నూతనంగా ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీ ప్రింటింగ్ షాప్ ని ప్రారంభించిన నెక్కొండ మండల బి ఆర్ యస్ పార్టీ అధ్యక్షులు సంగని సూరయ్య,సీనియర్ నాయకులు కొమ్ము రమేష్ యాదవ్,బి ఆర్ యస్ పార్టీ మండల సోషల్ మీడియా కన్వీనర్ మాతంగి రాజు,ఆకులపెల్లి నరేష్,తదితరులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్‌లో చెస్ సందడి ఏసీపీ లక్ష్మీనారాయణకు ఆహ్వానం

- గణేశ్ ఉత్సవాల వేళ చెక్‌మేట్ పోరు
- 27న పోటీలు.. రిజిస్ట్రేషన్‌కు నేటితో ముగింపు




**తొలి అక్షరం/షాద్ నగర్, సెప్టెంబర్ 25:** షాద్‌నగర్ గణేశ్ ఉత్సవాల సందర్భంగా షాద్‌నగర్‌లో తొలిసారిగా నిర్వహించనున్న చెస్ ఛాంపియన్‌షిప్‌కు ఏసీపీ లక్ష్మీనారాయణను నిర్వాహకులు ఆహ్వానించారు. షాద్‌నగర్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 27న మల్లికార్జున కాలనీలోని పతంజలి యోగా మందిర్ హాల్‌లో పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు చెస్ నిర్వాహకులు వనరాసి జగన్ ఏసీపీ లక్ష్మీనారాయణను మర్యాదపూర్వకంగా కలిసి పోటీలకు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. బాలబాలికల్లో దాగి ఉన్న చదరంగ ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించడమే లక్ష్యంగా పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అండర్-8 నుంచి అండర్-16 వరకు ఐదు విభాగాల్లో పోటీలు జరగనున్నాయి. ఉదయం 8.30 గంటలకు క్రీడాకారుల రిపోర్టింగ్, 9 గంటలకు ప్రారంభోత్సవం ఉంటుంది. విజేతలకు మెమెంటోలు, పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేయడంతో పాటు ప్రతి క్రీడాకారుడికి సర్టిఫికెట్ అందించనున్నారు. పోటీల్లో పాల్గొనాలనుకునే ఆసక్తి ఉన్న క్రీడాకారులు సెప్టెంబర్ 26లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. పూర్తి వివరాలకు 9346843126 నంబర్‌లో సంప్రదించవచ్చు

# యువ యూత్ అసోసియేషన్ నూతన కమిటీ కార్యవర్గం ఎన్నిక

**- యువ యూత్ అధ్యక్షులుగా కొడారి రాజు, ఉపాధ్యక్షులుగా కరకాల అఖిల్.**



**తొలి అక్షరం/చెన్నారావుపేట సెప్టెంబర్ 25:** వరంగల్ జిల్లా చెన్నరావుపేట మండలంలోని లింగగిరి గ్రామంలో యువ యూత్ అసోసియేషన్ కొత్త కమిటీ కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. నూతన అధ్యక్షులు కోడారి రాజు, ఉపాధ్యక్షులు కరకాల అఖిల్, ప్రధాన కార్యదర్శి రాకం ప్రశాంత్, కార్యదర్శి రాకం ప్రశాంత్ సన్నా ఆఫ్ ఉపేందర్ కోశాధికారి తాడేం వంశీ సహాయ కార్యదర్శి తాడేం మహేష్ ముఖ్య సలహాదారులు కుక్కల సతీష్,సాదబోయిన శ్రీకాంత్,మేడబోయిన రామకృష్ణ ,సదాబోయిన హరీష్,కాటా శ్రీకాంత్, రాకం ప్రదీప్,గేమ్స్ సెక్రటరీ కుక్కల విరాజ్, సోషల్ మీడియా ఇంచార్జి రాకం రాకేష్ ఎన్నుకోవడం జరిగింది.ఈ ఎన్నికకు సహకరించిన అధ్యక్షులకు గతమూడు సంవత్సరాలగా యువ యూత్ కి అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన తాడేం వినయ్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేస్తున్నాం. యువ యూత్ సభ్యులు, అధ్యక్షులు గ్రామ అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమ కార్యక్రమాలలో తోడ్పడడానికి ముందుకు రావడం జరిగిందని ఈ సందర్భంగా తెలియచేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు,సలహాదారులు,యూత్ సభ్యులు,పాల్గొన్నారు.

## నూతన ఫ్లెక్సీ ప్రింటింగ్ షాప్‌ని ప్రారంభించిన నర్సంపేట టి పి సి సి సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి



**తొలి అక్షరం/నెక్కొండ, సెప్టెంబర్ 25:**వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో వెంకటాపురం గ్రామానికి చెందిన ఏకాంబరం నూతనంగా ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీ ప్రింటింగ్ ప్రారంభించిన నర్సంపేట పిసిసి సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి, నెక్కొండ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, నెక్కొండ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు లావుడ్యా తిరుమల్ పట్టణ అధ్యక్షులు ఈదునూరి సాయి కృష్ణ నర్సంపేట కోర్టు ఏజీపీ బండి శివకుమార్ జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు దుడిమెట్ల రాజమౌళి రావుల రాజు తదితరులు పాల్గొన్నారు.

## నిమ్మవాగులో చేపల వేట సందడి.. వలలు విసురుతూ ఉత్సాహంగా వేట



**తొలి అక్షరం/కొణిజర్ల సెప్టెంబర్ 25**: కొణిజర్ల మండలం గద్దలగూడెం,ఏన్కూరు మండలం ఆరికాయలపాడు గ్రామాల మధ్య ప్రవహిస్తున్న నిమ్మవాగులో చేపల వేట సందడి నెలకొంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వాగులో పెరిగిన వరద ఉధృతి క్రమంగా తగ్గడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి జాలర్లు, చేపల వేటపై ఆసక్తి ఉన్న పలువురు వాగు వద్దకు చేరుకున్నారు.జాలర్లు వలలను గాల్లోకి విసిరి నీటిపై పరచి చేపలను పట్టుకుంటుండగా, వలలను నీటిలోకి విసిరి కొంతసేపటి తర్వాత బయటకు లాగుతున్న సమయంలో పెద్ద సంఖ్యలో చేపలు చిక్కుతుండడంతో వేటగాళ్లలో ఉత్సాహం నెలకొంది. వాగు పరిసరాల్లో చేపల వేట సాగడంతో సందడి వాతావరణం కనిపించింది. వలలు విసురుతూ, చేపలను పట్టుకుంటూ జాలర్లు ఉత్సాహంగా గడిపిన దృశ్యాలు అటుగా వెళ్లే వారిని, స్థానికులను ఆకట్టుకున్నాయి.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన కొమ్ము రమేష్ యాదవ్

**- మృతుల కుటుంబ సభ్యులకు పరామర్శ.. నివాళులు**





**తొలి అక్షరం/నెక్కొండ , సెప్టెంబర్ 25:** పెద్దకొర్పోల్ గ్రామానికి చెందిన బుదుగొండ కుమారస్వామి తల్లి, గ్రామవాసి బిర్రు యాకయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొమ్ము రమేష్ యాదవ్ వారి కుటుంబాలను పరామర్శించారు. మృతులకు పూలమాలలు వేసి నివాళు లర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఈదునూరి వెంకన్న, ఈదునూరి యాకయ్య, సోషల్ మీడియా కన్వీనర్ మాతంగి రాజు, సర్పంచ్ మట్టే రజిత శ్రీనివాస్, కర్ర బుచ్చిరెడ్డి, సొసైటీ మాజీ వైస్ చైర్మన్ మెండే వెంకన్న, పార్టీ అధ్యక్షులు బాధావత్ శోభన్, జమండ్ల వెంకన్న, బొడ్డుపల్లి శ్రీరాములు, దయ్యాల బిక్షపతి, బానోతు శ్రీనివాస్, ఆకులపల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# మాల మహానాడు మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక






**తొలిఅక్షరం/నర్సింహులపేట, సెప్టెంబర్ 25:** మాల మహానాడు నర్సింహులపేట మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంస్థాగత బలోపేతంలో భాగంగా మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు రాకేష్ ఎనమాల, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుండాల బిక్షం ఆధ్వర్యంలో కమిటీ ఎన్నిక నిర్వహించారు.కార్యక్రమానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రాల లింగయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుండాల బిక్షం, డోర్నకల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొప్పుల శ్రీనివాస్, మాల మహానాడు సీనియర్ నాయకులు గుండమల్ల రవికుమార్ హాజరై నూతన కమిటీ సభ్యులను అభినందించారు.మండల అధ్యక్షుడిగా కర్నె శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా చింతమల్ల యాకయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నిరుడు సమ్మయ్య, ఉపాధ్యక్షులుగా కొత్త మధు, బేతమల్ల అశోక్, సహాయ కార్యదర్శిగా ఇర్రి రామస్వామి, కోశాధికారిగా బేతమల్ల వెంకన్న, గౌరవ సలహాదారులుగా బేతమల్ల ఉప్పలయ్య, బేతమల్ల శంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.నూతన కమిటీ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాల సాధన, సామాజిక న్యాయం, హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని నాయకులు సూచించారు. గ్రామస్థాయి నుంచి మండలస్థాయి వరకు సంస్థను బలోపేతం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.

## ఉప్పొంగిన వాగు.. నిలిచిన రాకపోకలు

**- ఆరికాయలపాడుజన్నారం మధ్య బ్రిడ్జి నిర్మాణం ఎప్పుడో..? ఏళ్లుగా తప్పని ఇబ్బందులు**



**తొలి అక్షరం /ఏన్కూర్ సెప్టెంబర్ 25:** ఏన్కూర్ మండలం ఆరికాయలపాడుజన్నారం గ్రామాల మధ్య వాగు పొంగిపొర్లడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వర్షాలు కురిసిన ప్రతిసారీ వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు కూడా అవస్థలు పడుతున్నారు.ఈ ప్రాంతంలో బ్రిడ్జి నిర్మాణానికి గతంలోనే అనుమతి లభించిందని అధికారులు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నప్పటికీ ఇప్పటివరకు పనులు ప్రారంభం కాకపోవడంపై గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా వెంటనే బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

## నూతన ఫ్లెక్స్ ప్రింటింగ్ షాపు ప్రారంభం

**- తెలంగాణ పంచాయతీ రాజ్ మాజీ సభ్యులు గటిక అజయ్ కుమార్.**



**తొలి అక్షరం/నెక్కొండ, సెప్టెంబర్ 25:**వరంగల్ జిల్లా నెక్కొండ మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన బోయిని యాకాంబ్రం నూతనంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్స్ ప్రింటింగ్ షాపును ప్రారంభించిన సందర్భంగా ముఖ్య అతిథిగా తెలంగాణ పంచాయతీరాజ్ మాజీ సభ్యులు, మాజీ ఎంపీపీ గటిక అజయ్ కుమార్ హాజరై యాకాంబ్రం కి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు లింగమూర్తి , మాజీ వైస్ ఎంపీపీ దొరికిన సారంగపాణి , ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఇదునూరి యాకయ్య , బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శివరాం నాయక్ , అలంకానిపేట రెడ్యానాయక్ తండా సర్పంచ్ అంగోత్ రమేష్ నాయక్ , అంగోత్ సురేష్ నాయక్ , సినియర్ ప్రాత్రికేయులు గిరగాని శ్రీనివాస్,నెక్కొండ మాజీ వార్డ్ సభ్యులు జమాన్ జ్యోతి రాజు , మాజీ సర్పంచ్ జవహర్‌లాల్ ,బి ఆర్ ఎస్ యువ నాయకులు బొల్లెపెల్లి శ్రవణ్ కుమార్, మరియు మండల ఫోటోగ్రాఫర్లు, వివిధ పార్టీల నాయకులు పాల్గొని యాకాంబ్రం కి శుభాకాంక్షలు తెలిపారు.నూతన వ్యాపారం విజయవంతంగా అభివృద్ధి చెందాలని, మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.



# రోడ్డు భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

**- ప్రమాద ప్రాంతాల్లో తక్షణ, దీర్ఘకాలిక చర్యలు చేపట్టాలి**




**ఖమ్మం, సెప్టెంబర్ 25 (తొలి అక్షరం):** రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టి, రోడ్డు భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో రోడ్డు భద్రతపై సమీక్ష నిర్వహించారు.ప్రమాదకర ప్రాంతాలను సంయుక్తంగా పరిశీలించి తక్షణ, దీర్ఘకాలిక చర్యలు చేపట్టాలని సూచించారు. రంబుల్ స్ట్రిప్స్, రోడ్డు మార్కింగ్‌లు, హెచ్చరిక బోర్డులు, బ్లింకర్లు ఏర్పాటు చేయడంతో పాటు శ్రీశ్రీ సర్కిల్ వద్ద వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు.రోడ్డు భద్రతా సామగ్రి కొనుగోలులో నాణ్యత, ప్రమాణాలను పరిశీలించాలని, చేపట్టిన పనులకు ముందు, తర్వాత ఫొటోలతో నివేదికలు సిద్ధం చేయాలని తెలిపారు. పోలీసు, మున్సిపల్, ఇంజినీరింగ్ శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రమాదాల నివారణకు శాశ్వత పరిష్కారాలు చూపాలని కలెక్టర్ సూచించారు.

## పాలేరు వరద నీటిని చెరువులకు మళ్లిస్తున్నాం

**- నీటిని వృథా కాకుండా సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ దివాకర టీఎస్**



**ఖమ్మం, సెప్టెంబర్ 25 (తొలి అక్షరం):** పాలేరు జలాశయానికి వస్తున్న వరద నీటిని జిల్లాలోని చెరువులకు మళ్లిస్తూ సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. పాలేరు రిజర్వాయర్‌లో నీటి మట్టం, కాలువల ప్రవాహాన్ని ఆయన పరిశీలించారు.అల్పపీడనం నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. జిల్లాలోని చెరువుల్లో ప్రస్తుతం 25 నుంచి 30 శాతం నీటి నిల్వలు ఉన్నాయని, అదనపు నీటిని మళ్లించి చెరువులను మరింత నింపేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.వర్షాలు, వరద పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పలు గ్రామాల్లో కొనసాగుతున్న భూ రీ-సర్వే పనులను కలెక్టర్ పరిశీలించారు.

## ఏన్కూరు పీహెచ్‌సీలో డిప్యూటీ డీఎంహెచ్‌వో తనిఖీ

**- సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచన**



**తొలి అక్షరం/ఏన్కూర్, సెప్టెంబర్ 25:** ఏన్కూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రదీప్ బాబు శుక్రవారం తనిఖీ చేశారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు, రికార్డులు, వైద్య సేవలను పరిశీలించారు.సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి, ముందస్తు చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. గర్భిణులకు ప్రత్యేక శ్రద్ధతో మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ఆవుల శ్రీనివాస్ జన్మదిన వేడుకలు

**- కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో వేడుకలు**





**తొలి అక్షరం/నెక్కొండ, సెప్టెంబర్ 25:** నెక్కొండ మండల కేంద్రంలోని మహేశ్వర ఫంక్షన్ హాల్‌లో రెడ్లవాడ సొసైటీ చైర్మన్ ఆవుల శ్రీనివాస్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, మండల అధ్యక్షుడు తిరుమల్, పలువురు కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ ప్రతినిధులు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గూడూరు జయశ్రీ కుటుంబానికి న్యాయం చేయాలి

**-4వ రోజు నిరసనకు మద్దతు తెలిపిన ప్రజా సంఘాల నేతలు**

**ఆమెను ఇంట్లో బంధించిన అత్త మీరాబాయి పై చర్యలు తీసుకోవాలి**

**ఆమెకు గతంలో రాసిచ్చిన ఇల్లు,ఆస్తులు ఇప్పించాలి**

**-సిపి,ఎమ్మెల్యే,కలెక్టర్ దృష్టి సారించాలి**

**ప్రజా సంఘాల నేతలు చుంచు రాజేందర్,మాదాసి సురేష్,కేడల ప్రసాద్,అంకేశ్వరపు రామచందర్ రావు**



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** అత్త మీరాబాయి చేత ఇంట్లో తాళం వేసి బంధించబడి నాలుగు రోజులుగా తిండి,నిద్ర లేకుండా నరకయాతన అనుభవిస్తున్న హనుమకొండ రాంనగర్ కు చెందిన గూడూరు జయశ్రీ కుటుంబానికి న్యాయం చేయాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధ్యక్షుడు చుంచు రాజేందర్,ప్రజాసంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్,మహాత్మా జ్యోతిరావు పూలే సామాజిక న్యాయవేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేడల ప్రసాద్ పటేల్,మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అంకెశ్వరపు రామచందర్ రావు లు డిమాండ్ చేశారు.అత్త మీరాబాయి చేత బంధించబడి ఇంటిలోనే గూడూరు జయశ్రీ చేస్తున్న నిరసన శుక్రవారంతో నాలుగవ రోజుకు చేరిన సందర్భంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సంఘటన స్థలాన్ని సందర్శించి బాధితురాలికి మద్దతుగా ఇంటి ముందు నిరసన దీక్షలో పాల్గొని అండగా నిలిచారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...గతంలో గూడూరు జయశ్రీకి తన అత్త మీరాబాయి నోటరీ డాక్యుమెంట్ ద్వారా రాసిచ్చిన ఇల్లు తో పాటు ఆమెకు రావాల్సిన ఆస్తులు వెంటనే ఇప్పించాలని,ఆమెను ఆమె కూతురు తేజస్విని రక్షించాలని ఇందుకు స్థానిక ఎమ్మెల్యే,సిపి,జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కేయూ జాక్ చైర్మన్ డాక్టర్ మంద వీరాస్వామి,మాదిగ ప్రజాసమితి రాష్ట్ర అధ్యక్షుడు మేడ స్వామి మాదిగ,నాయకులు మోరే ఐలయ్య,గోల్కొండ శ్రీనివాస్,శ్రీరాం మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# రక్తదాన శిబిరం విజయవంతం: బీజేవైఎం రామన్నపేట



**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 25:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజు సందర్భంగా సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 17 వరకు నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమాలలో భాగంగా రామన్నపేట మండల కేంద్రంలో రక్తదాన శిబిరం విజయవంతంగా నిర్వహించబడింది.బీజేవైఎం నల్గొండ జిల్లా యువ నాయకులు అక్కెనపల్లి సైదులు ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరానికి అధిక సంఖ్యలో యువకులు, పెద్దలు, మహిళలు పాల్గొని రక్తదానం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేవైఎం నల్గొండ జిల్లా అధ్యక్షులు కంబాలపల్లి సతీష్ యాదవ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రక్తదానం మించిన దానం లేదని, యువత సేవా కార్యక్రమాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నల్గొండ జిల్లా ఉపాధ్యక్షులు మైల నర్సింహ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏలే సంజీవరెడ్డి, జయరపు రామకృష్ణ, రాష్ట్ర నాయకులు కన్నెగంటి వెంకటేశ్వర చారి, మాజీ మండల అధ్యక్షుడు పల్లపు దుర్గయ్య, మండల ప్రధాన కార్యదర్శి జంగిలి సత్యనారాయణ, మండల కార్యదర్శి బత్క నరేష్, రేపాక లింగుస్వామి, సీనియర్ నాయకులు దొగ్గపర్తి సుభాష్, కొమ్ము యాదయ్య, సిందం లింగయ్య, ఏలూరి రవి, యాదాసు లక్ష్మణ్, కూనూరు సుధాకర్, గుండాల అంజయ్య గౌడ్, కొడారి వెంకటేష్ యాదవ్, మెడబోయిన ఉపేందర్, మందడి శ్రీధర్ రెడ్డి, సింగం లింగుస్వామి, గజం సత్యం, ఏలే వెంకటనర్సయ్య, జల్లా లక్ష్మీనారాయణ, బడుగు యాదగిరి, అప్పం లక్ష్మణర్సయ్య, తిరుమలేష్ పాల్గొన్నారు.యువ మోర్చా నాయకులు దావనూరి అజయ్, నూకలి సైదులు, రేఖ నర్సింహ, సంతోష్, సురేష్, పరిమేష్, శివ, శేఖర్, అరవింద్, రాము, కూనూరు నవీన్, సింగం మత్స్యగిరి, శోషబోయిన మాధవ్ యాదవ్, ఎర్రబోయిన వెంకటేష్, సల్ల కార్తీక్, చేరుకు గణేష్, బైరు వెంకన్న, అక్కెనపల్లి రాంబాబు, తదితర యువకులు, పెద్దలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# బీజేపీ కార్యకర్త తండ్రి మృతి

**- కుటుంబాన్ని పరామర్శించిన బీజేపీ నేతలు**




**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 25:** ఇస్కిల్లగ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త పైళ్ల నికేతన్ రెడ్డి తండ్రి పైళ్ల ప్రతాప్ రెడ్డి మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీజేపీ నేతలు ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నకిరేకంటి మొగులయ్య, మండల ప్రధాన కార్యదర్శి జంగిలి సత్యనారాయణ, శంకర్ రెడ్డి, దామోదర్ రెడ్డి, బందెల సంజీవ్, పిండి మల్లేష్, రాజశేఖర్ రెడ్డి, జితేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** భారతీయ జనతా పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో హనుమకొండ జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి ఘనంగా నిర్వహించారు. అనంతరం జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి మాట్లాడుతూ...ఈరోజు భారతీయ జనతా పార్టీ ఆవిర్భవించింది అంటే దానికి కృషి పండిట్ దీన్ దయల్ ఉపాధ్యాయ అని అన్నారు.అలాగే పండిట్ దీన్ దయాల్ జనసంగ్,జనతా పార్టీ అలాగే ఇప్పుడున్న భారతీయ జనతా పార్టీలో పనిచేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు మార్తినేని ధర్మారావు,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పులిసరత్యం రెడ్డి,చాడా స్వాతి,ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కందగట్ల సత్యనారాయణ,జిల్లా ప్రధాన కార్యదర్శి,డా సంద్ర మధు,జయంత్ లాల్,ఉపాధ్యక్షులు కూతురు రాజు,బైరీ శ్రవణ్,కార్యదర్శులు,అరణ్య రెడ్డి,వాసుదేవరెడ్డి,గిరిజన నాయకులు నాను నాయక్,యువ మోర్చా అధ్యక్షులు పున్నం వేణు,సీనియర్ నాయకులు, రాజభద్రయ్య, శనిగరం విజయ్ కుమార్,బింగి శ్రీను,బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది

## ఫైర్ ఎస్ఐ అనిల్ కుటుంబాన్ని పరామర్శించిన

# సర్పంచుల ఫోరం నేత విక్రమ్



**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 25:** గుండెపోటుతో మృతి చెందిన వేములవాడ ఫైర్ ఎస్ఐ నాగు అనిల్ కుటుంబాన్ని తెలంగాణ సర్పంచుల ఫోరం జేఏసీ రాష్ట్ర కార్యదర్శి గర్దాసు విక్రమ్ పరామర్శించి నివాళు లర్పించారు.యాదాద్రి ఫైర్ ఆఫీసర్ మధుసూదన్ రావు, కరీంనగర్ డీఎఫ్ఓ శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఎఫ్ఓలు మధుకర్, హమీద్, శివాజి, బీకు పాల్గొన్నారు.

# రామన్నపేట మండల ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు ప్రకటన




**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 25:** 2026 విద్యా సంవత్సరానికి గాను మండల ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ఎంపిక కార్యక్రమం 26-09-2026న మత్యగిరి లక్ష్మీ నరసిం హ స్వామి ఫంక్షన్ హాల్లో జరగనుందని ఎంఈఓ టి. సురేందర్ రెడ్డి తెలిపారు.ఎంపికైన ఉపాధ్యాయులు:ప్రాథమిక విభాగం: కొమ్మాయిగూడెం- కె.కోటేష్, శోభనాద్రిపురం- పి.కళావతి, వెల్లంకి- ఎం.వెంకటయ్య, ఎన్నారం- ఎస్కే. మస్తాన్, రామన్నపేట- బి.సునీతఉన్నత పాఠశాల విభాగం: కొమ్మాయిగూడెం- బి.బాలరాజు, జనంపల్లి- ఆర్.శంకర్, ఎన్నారం- ఎన్.శేఖర్, ఇంద్రపాలనగరం- కె.శ్రీనివాస్ రెడ్డి, మునిపంపుల- ఎన్.మనోహర్, వెల్లంకి- కసాని స్వప్నజిల్లా ఉత్తమ పురస్కారాలు:దుబ్బాక- కె.లలిత, జనంపల్లి- కె.సందీప్ కుమార్, రామన్నపేట బిసి కాలనీ- వి.జనార్ధన్బడిబాటలో అధిక నమోదు: ఇంద్రపాలనగరం- కె.శేఖర్, శోభనాద్రిపురం- జి.శ్రీనివాస్ రెడ్డి బాచుప్పల వి.వెంకటయ్య

# యశోద హాస్పిటల్స్, సోమాజిగూడలో అధునాతన ఇఎన్‌టి వాయిస్ & ఎయిర్‌వే చికిత్సలు




**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** యశోద హాస్పిటల్స్, సోమాజిగూడలో సమగ్ర ఇ ఎన్ టి వైద్య సేవలను మరింత బలోపేతం చేస్తూ,లారింజాలజీ,పీడియాట్రిక్ ఇ ఎన్ టి,ఎయిర్‌వే సర్జరీ,హెడ్&నెక్ సర్జరీ,రైనాలజీ&స్కల్ బేస్ సర్జరీ,ఓటాలజీ మరియు అలర్జీ వంటి విభాగాల్లో అధునాతన వైద్య సేవలను అందించే ప్రత్యేక నిపుణుల బృందం అందుబాటులో ఉందని డా.అశీష్ డోరా అన్నారు.హనుమకొండ లోని యశోద హాస్పిటల్ బ్రాంచ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ ఆశిష్ డోరా మాట్లాడుతూ...వాయిస్ మరియు మింగడంలో సమస్యలు,పిల్లల్లో శ్వాసనాళాలకు సంబంధించిన సమస్యలు,లారింగోట్రాకియల్ స్టెనోసిస్,స్వరపేటికకు సంబంధించిన సమస్యలు,గురక మరియు నిద్రలో శ్వాసకు సంబంధించిన సమస్యలు,అలాగే ఇతర క్లిష్టమైన శ్వాసనాళ సమస్యలకు ఈ బృందం ప్రత్యేక పరీక్షలు,వైద్య చికిత్సలు,శస్త్రచికిత్సలను అందిస్తోందన్నారు.హై-డెఫినిషన్ ఎండోస్కోపీ , న్యారో బ్యాండ్ ఇమేజింగ్, (స్ట్రోబోస్కోపీ ) వంటి ఆధునిక నిర్ధారణ సదుపాయాలు,అలాగే అధునాతన శస్త్రచికిత్సా పద్ధతుల సహకారంతో,వివిధ ఇ ఎన్ టి సబ్‌స్పెషాలిటీల నిపుణుల సమన్వయంతో ఒకే చోట సమగ్ర,శాస్త్రీయ ఆధారాలతో కూడిన మరియు రోగి-కేంద్రిత వైద్య సేవలను అందించడమే ఈ యూనిట్ లక్ష్యం అని తెలిపారు.ఈ నిపుణుల బృందంలో లారింజాలజీ,పీడియాట్రిక్ ఇ ఎన్ టి,ఎయిర్‌వే సర్జరీ,అలర్జీ మరియు ఓటాలజీలో ప్రత్యేక నైపుణ్యం కలిగిన డా.అశీష్ డోరా ఘన్‌పూర్,హెడ్ & నెక్ ఆంకో సర్జరీ,రైనాలజీ & స్కల్ బేస్ సర్జరీలో నైపుణ్యం కలిగిన డా.ఎన్.అపూర్వా రెడ్డి,అలాగే జూనియర్ కన్సల్టెంట్ జుచీ డా.దీప్తాబా మిశ్రా ఉన్నారు."సాధారణ ఇ ఎన్ టి సమస్యల నుంచి సంక్లిష్టమైన ఇ ఎన్ టి,వాయిస్ మరియు ఎయిర్‌వే సమస్యల వరకు అన్ని రకాల పరిస్థితులకు సమగ్ర ఇ ఎన్ టి కేంద్రంగా సేవలందించడమే మా లక్ష్యం అని,వివిధ ఇ ఎన్ టి సబ్‌స్పెషాలిటీల నిపుణులు సమన్వయంతో పనిచేస్తూరోగులకు ప్రత్యేకమైన మరియు సమగ్ర వైద్య సేవలను అందించాలనుకుంటున్నాము," అని డా. అశీష్ డోరా ఘన్‌పూర్ ఈ సందర్భంగా తెలిపారు.

# రామన్నపేట కళాశాలలో ఘనంగా 'నషా ముక్త్ యువా' సదస్సు

**- మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచన**




**తొలి అక్షరం/రామన్నపేట, సెప్టెంబర్ 25:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యువతలో మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించేందుకు 'నషా ముక్త్ యువా' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ ఏడుకొండలు, వైద్య అధికారి గోపాల్ ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు.విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన అలవాట్లతో భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ప్రసన్నదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ అధికారులు అశోక్ కుమార్, అశోక్ రెడ్డి సమన్వయం చేశారు.అనంతరం కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. విద్యార్థులు సంతకాల సేకరణలో పాల్గొని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# రామన్నపేటలో రోడ్లు కాదు.. మృత్యు గుంతలు! ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం



**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 25:** రామన్నపేట మండలంలో రోడ్లు లేవు, ఉన్నదల్లా గుంతలే! పల్లివాడ, మునిపంపుల, దుబ్బాక, ఇంద్రపాలనగరం రోడ్ల పరిస్థితి చూస్తే ప్రభుత్వం ఉందా? అధికారులు ఉన్నారా? అనే అనుమానం కలుగుతోంది.కోట్లు ఖర్చు పెట్టి రోడ్లు వేశామని గొప్పలు చెప్పుకునే ప్రభుత్వానికి, క్షేత్రస్థాయిలో రోడ్ల దుస్థితి కనిపించడం లేదా? రోడ్లపై ఏర్పడిన పెద్దపెద్ద గుంతలు వాహనదారుల పాలిట మృత్యు గుంతలుగా మారాయి. రోజూ ఎక్కడో ఒక చోట బైక్ బోల్తా పడుతోంది. విద్యార్థులు, రైతులు, గర్భిణీలు ఈ రోడ్లపై ప్రయాణం అంటేనే వణికిపోతున్నారు.వర్షం పడితే ఈ రోడ్డు చెరువును తలపిస్తోంది. గుంతలో నీరు నిలిచి రోడ్డు ఎక్కడ ఉందో, ప్రమాదం ఎక్కడ పొంచి ఉందో తెలియని దుస్థితి.**ప్రజల సహనానికి హద్దు ఉంది!** అధికారుల తీరుపై సర్పంచులు మండిపడ్డారు. పల్లివాడ సర్పంచ్ కమ్మంపాటి శ్రీనివాసులు, మునిపంపుల సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం జిల్లా కలెక్టరేట్ లో ఆర్&బీ ఈఈకి వినతిపత్రం ఇచ్చారు.ఏసీ గదుల్లో కూర్చుని ఫైళ్లు చూడటం కాదు, ఒకసారి ఫీల్డ్ కు వచ్చి ఈ రోడ్లపై తిరగండి. అప్పుడు తెలుస్తుంది ప్రజలు పడుతున్న నరకం ఏంటో. తూతూ మంత్రంగా గుంతలు పూడ్చడం కాదు, పూర్తిస్థాయిలో రోడ్లు పునర్నిర్మించాలి. లేకపోతే ప్రజలే రోడ్డెక్కి ఆందోళన చేస్తారు" అని హెచ్చరించారు.ప్రజల ప్రాణాలకు బాధ్యత వహించాల్సిన ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి, తక్షణమే రోడ్ల మరమ్మతులు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. వీరి వెంట తుమ్మలగూడెం సర్పంచ్ గర్దాసు విక్రం ఉన్నారు.

# ఆవుల శ్రీనివాస్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న రమేష్ రాథోడ్

**- కేక్ కట్ చేసి శాలువాతో సత్కారం**



**తొలి అక్షరం / నెక్కొండ సెప్టెంబర్ 25:** రెడ్లవాడ పీఏసీఎస్ చైర్మన్ ఆవుల శ్రీనివాస్ జన్మదిన వేడుకల్లో నెక్కొండ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు, బంజరపల్లి సర్పంచ్ భూక్య రమేష్ రాథోడ్ పాల్గొన్నారు. కేక్ కట్ చేసి, శాలువాతో సత్కరించి శ్రీనివాస్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బంజరపల్లి, చంద్రుగొండ గ్రామాల కాంగ్రెస్ నాయకులు రాళ్లబండి రాంబాబుతో పాటు పలువురు కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

# గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించిన వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్



**తొలి అక్షరం/ హన్మకొండ ప్రతినిధి:** వర్ధన్నపేట నియోజకవర్గం గ్రేటర్ వరంగల్ 66వ డివిజన్ హాసన్ పర్తి గ్రామంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవస్థానంలో నిర్వహించిన గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా చివరి రోజు నిమజ్జనం సందర్భంగా గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్న ప్రసాదాన్ని అందించిన వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్.ఈ సందర్భంగా మాట్లాడుతూ...రేణుక ఎల్లమ్మ తల్లి,గణపతి ఆశీస్సులతో హాసన్ పర్తి గ్రామ ప్రజలందరూ ఆయు రారోగ్యాలతో,సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు,గణపతి నిమర్జనం భక్తులు,యువత శాంతియుత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక ముఖ్య నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సిద్ధి వినాయకుడి లడ్డూకు రూ.22,500.. దక్కించుకున్న కొండ మౌనికశ్రీనివాస్ రెడ్డి దంపతులు

- ఉప్పల్ సిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో ఘనంగా లడ్డూ వేలంపాట
- భక్తిశ్రద్ధల మధ్య సాగిన వేలంపాటలో లడ్డూను సొంతం చేసుకున్న దంపతులు



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ సెప్టెంబర్ 25:** ఉప్పల్: ఉప్పల్‌లోని సిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో లడ్డూ వేలంపాటను ఘనంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో సాగిన ఈ కార్యక్రమంలో స్థానికులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. లడ్డూను సొంతం చేసుకునేందుకు భక్తులు ఉత్సాహంగా వేలంపాటలో పాల్గొనగా, చివరకు కొండ మౌనికశ్రీనివాస్ రెడ్డి దంపతులు రూ.22,500కు సిద్ధి వినాయకుడి లడ్డూను దక్కించుకున్నారు.ఈ సందర్భంగా దంపతులు మాట్లాడుతూ.. వినాయకుడి లడ్డూను దక్కించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని, స్వామివారి ఆశీస్సులు తమ కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నామని తెలిపారు. భక్తితో స్వామివారిని కొలిస్తే కుటుంబంలో సుఖసంతోషాలు, శాంతి, ఐశ్వర్యం కలుగుతాయని విశ్వసిస్తున్నామని చెప్పారు. సిద్ధి వినాయకుడి కృపతో తమ కుటుంబంతో పాటు ప్రతి ఒక్కరి జీవితంలో మంచి జరగాలని, అందరూ ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.లడ్డూ వేలంపాటలో పాల్గొన్న భక్తులు, యువతకు దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన సిద్ధి వినాయక యూత్ సభ్యులను పలువురు అభినందించారు.


# పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం: సూపర్వైజర్ సంధ్య



**తొలి అక్షరం/మిర్యాలగూడ సెప్టెంబర్ 25:** వెంకటాద్రిపాలెం, అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని అన్నారం సెక్టార్ వెంకటాద్రిపాలెం గ్రామ పంచాయతీలో సర్పంచ్ జీడికంటి ఉమ అధ్యక్షతన పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సూపర్వైజర్ సంధ్య మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యానికి ప్రతిరోజూ సమతుల్యమైన పోషకాహారం తీసుకోవాలని సూచించారు. రోజువారీ ఆహారంలో వైవిధ్యం ఉండాలని, మాంసకృత్తులు అధికంగా ఉండే పప్పుధాన్యాలు, పాల ఉత్పత్తులు, గుడ్లు తీసుకోవాలని వివరించారు. రక్తహీనత నివారణకు ఆకుకూరలు, గింజలు, నువ్వులు తీసుకోవడంతో పాటు శరీరంలో ఐరన్ సక్రమంగా శోషించబడేందుకు విటమిన్-సి అధికంగా ఉండే నారింజ, జామ, ఉసిరి వంటి పండ్లను ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు.అనంతరం కేశవ్‌నగర్ తండా అంగన్వాడీ టీచర్ యశోద గ్రామస్థులతో పోషణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మాతంగి ప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్ సతీష్, వార్డు సభ్యులు, అంగన్వాడీ టీచర్లు ఎస్‌కే నసీమ సుల్తానా, శారద, ఆశా కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

- కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ • భక్తిశ్రద్ధలతో గణేష్ టెంపుల్ రథోత్సవం
- శోభాయాత్రను ప్రారంభించిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్
- భక్తులకు నవరాత్రి ఉత్సవ శుభాకాంక్షలు



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి( పి.సైదులు), సెప్టెంబరు25:** సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ రహదారిలోని ప్రసిద్ధ గణేష్ ఆలయంలో గణేష్ నవరాత్రి నిమజ్జన రథోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా,ఆధ్యాత్మిక కోలా హలం మధ్య జరిగింది. ఈ మహోత్సవానికి సికింద్రా బాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే శ్రీగణేష్‌కి ఆలయ నిర్వాహకులు, పండితులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ సందర్భంగా స్వామివారి శోభాయాత్ర రథాన్ని ఎమ్మెల్యే స్వయంగా ప్రారంభించి, భక్తులతో కలిసి ఊరేగింపులో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లా డుతూ.. నియోజకవర్గ ప్రజలందరికీ గణేష్ నవరాత్రి ఉత్సవ శు భాకాంక్షలు తెలిపారు. విఘ్నే శ్వరుడి కృపాకటాక్షాలతో కంటోన్మెంట్ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో విలసి ల్లాలని స్వామివారిని వేడుకున్నట్లు పేర్కొన్నారు. కోలాహలంగా సాగిన ఈ వేడుకలో ఆలయ కమిటీ ప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు, ప్రజాప్రతినిధులు,పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

# సమైక్యతకు పీఠం..భద్రతకు అభయం

**-అర్ధరాత్రి వేళ కూడా శాంతియుతంగా వినాయక నిమజ్జనాలు**

**-తెలంగాణ రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్**








**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు), సెప్టెంబర్25:** తెలంగాణ నేల మరోసారి తన విశిష్ట సంస్కృతిని, గంగా-జమునా తెహజీబ్ సమైక్యతా దృశ్యాన్ని సమున్నతంగా చాటిచెప్పింది.రాష్ట్రవ్యాప్తంగా వినాయక నిమజ్జన మహోత్సవాలు అత్యంత కట్టుదిట్టమైన భద్రత, సర్వమత సామరస్యం మధ్య ప్రశాంతంగా సాగుతున్నాయని తెలంగాణ రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ (డీజీపీ) సీవీ ఆనంద్ విలేకరుల సమావేశంలో ప్రకటించారు.కమాండ్ కంట్రోల్ సెంటర్ నుండి నిమిషానికోసారి పర్యవేక్షిస్తూ, అహర్నిశలు శ్రమిస్తున్న పోలీసు యంత్రాంగానికి ప్రజల సహకారం లభించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. **లక్ష దాటిన గణనాథులు..రేపటికల్లా సంపూర్ణం:** రాష్ట్ర చరిత్రలోనే రికార్డు స్థాయిలో నిమజ్జన ప్రక్రియ కొనసాగుతోందని డీజీపీ తెలిపారు.ఈసారి ప్రత్యేక గణేష్ పోర్టల్ ద్వారా 1,24,000 విగ్రహాలు నమోదు కాగా, ఇళ్లల్లో, అపార్ట్‌మెంట్లలో నెలకొల్పిన విగ్రహాలను కలిపితే మొత్తం 3.5 లక్షల నుండి 4 లక్షల వరకు ఉత్సవాలు జరిగాయని అంచనా వేశారు.శుక్రవారం ఉదయానికే 88,000 విగ్రహాల నిమజ్జనం పూర్తయ్యిందని, శనివారం ఉదయం 10.30 గంటలలోపు మిగిలిన అన్ని విగ్రహాలను గంగమ్మ ఒడికి చేర్చేలా కచ్చితమైన ప్రణాళిక అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. **భాయి-భాయి అన్న నేల..మత సామరస్యానికి సలామ్:** శుక్రవారం ప్రార్థనల సమయాన్ని దృష్టిలో ఉంచుకుని, మతపరమైన విశ్వాసాలను పరస్పరం గౌరవించుకుంటూ ఊరేగింపులను మధ్యాహ్నం కొంత ఆలస్యంగా ప్రారంభించినట్లు డీజీపీ వివరించారు. భైంసా వంటి అత్యంత సున్నిత ప్రాంతాల్లో ముస్లిం సోదరులు హిందూ-ముస్లిం భాయ్-భాయ్ నినాదాలతో గణేశుడి ఊరేగింపులో పాల్గొని స్వీట్లు పంచిపెట్టడం తెలంగాణ ప్రజల అఖండ సమైక్యతకు తిరుగులేని నిదర్శనమని కొనియాడారు. **25 వేల బలగాలతో నిఘా నేత్రాలు..గగనతలం నుంచి ఏరియల్ సర్వే:** మహా నగరంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసు యంత్రాంగం ఉక్కు కోటను నిర్మించింది.టీజీఎస్‌పీ, ఆర్‌ఏఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఆక్టోపస్ బలగాలతో పాటు డీజీపీ రిజర్వ్ నుంచి 5 ప్రత్యేక కంపెనీలు, మొత్తం 25,000 మందికి పైగా సిబ్బంది రంగంలో ఉన్నారు. హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, సీపీ, జీహెచ్‌ఎంసీ కమిషనర్, కలెక్టర్లతో కలిసి హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే నిర్వహించి ప్రతి ఊరేగింపు మార్గాన్ని ప్రత్యక్షంగా తనిఖీ చేసినట్లు చెప్పారు. వేలాది సీసీటీవీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించి సెకను సెకనుకూ నిఘా కొనసాగిస్తున్నారు. **డీజేల మోతపై ఉక్కుపాదం..విధి నిర్వహణలో ఎస్సై అమరత్వం:** ఉత్సవాల వేళ సంభవించిన ప్రమాదాల్లో 13 మంది ప్రాణాలు కోల్పోవడం, 26 మంది గాయపడటం పట్ల డీజీపీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు.బందోబస్తు విధులకు వచ్చి గుండెపోటుతో కన్నుమూసిన కొత్తగూడెం ఎస్సై వెంకన్న సేవలను డీజీపీ స్మరించుకున్నారు. పటాన్‌చెరు, నిర్మల్ వంటి ప్రాంతాల్లో సంభవించిన మరణాలకు శబ్ద కాలుష్యం, డీజేల శబ్ద తీవ్రతే కారణమని ప్రాథమికంగా తేలిందన్నారు.శబ్ద పరిమితులు దాటితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. **ఆరో దశ ముగిసే వరకు పోలీసు పహారా:** గణేష్ ఉత్సవాల పర్యవేక్షణను పోలీసులు 6 విడతలుగా విభజించారని, చివరి భక్తుడు నిమజ్జనం పూర్తి చేసుకుని క్షేమంగా ఇల్లు చేరే వరకు 6వ దశ విధి నిర్వహణ నిరంతరాయంగా సాగుతుందని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. మండపాల నిర్వాహకులు ప్రతిమలను ఆలస్యం చేయకుండా, పోలీసుల సూచనలు పాటిస్తూ నిమజ్జన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని పిలుపునిచ్చారు.

# దేశానికే దిక్సూచిగా రాష్ట్ర పోలీస్ వ్యవస్థ

- తెలంగాణ రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్
- డ్రగ్స్ రహిత తెలంగాణే ధ్యేయం
- మాదకద్రవ్యాల ముఠాలపై ఈగల్ ఉక్కుపాదం
- జాతీయ స్థాయిలో ఘన విజయం
- 10 కీలక సూచికల్లో ఆరింటిలో తెలంగాణదే అగ్రస్థానం
- అంతర్జాతీయ నెట్‌వర్క్‌ల గుండెల్లో గుబులు
- థాయిలాండ్,గోవా డ్రగ్ డాన్‌లపై పిడుగులా పడ్డ ఈగల్
- డార్క్ వెబ్ కుట్రల భగ్నం..అక్రమ ఆస్తుల ఊచకోత





**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు), సెప్టెంబర్ 25:** మాదకద్రవ్యాల కారకులు ఎంతటివారైనా సరే..ఖాకీ ఉక్కుపాదం కింద నలిగిపోవాల్సిందేనని తెలంగాణ నేలపై డ్రగ్స్ రాక్షసత్వాన్ని శాశ్వతంగా పూడ్చిపెడతామని రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ (డీజీపీ) సీవీ ఆనంద్ గంభీరంగా ప్రకటించారు.డ్రగ్స్ ముఠాల నడుము విరిచి రహిత రాష్ట్రంగా తెలంగాణను నిలబెట్టడమే మా లక్ష్యం అని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల ఢిల్లీ వేదికగా జరిగిన జాతీయ యాంటీ నార్కోటిక్స్ అధిపతుల సదస్సులో వెల్లడైన సంచలనాత్మక గణాంకాలను శుక్రవారం డీజీపీ కార్యాలయంలో సమీక్షించారు.డ్రగ్స్ నిర్మూలనలో దేశానికే తెలంగాణ మోడల్ దిక్సూచిగా నిలిచిందని, నిర్దేశించిన 10 అత్యంత కీలక పనితీరు సూచికల్లో ఏకంగా 6 అంశాల్లో తెలంగాణ నెంబర్-1గా నిలిచి చరిత్ర సృష్టించిందని వెల్లడించారు.ఈ సందర్భంగా ఈగల్ విభాగాధిపతి సందీప్ శాండిల్య నేతృత్వంలోని బృందాన్ని డీజీపీ ఆకాశానికెత్తేశారు. **మూలాలను నరికేస్తున్న వేట..జాతీయ రికార్డులు భగ్నం:** చిల్లర విక్రేతలను పట్టుకుని చేతులు దులుపుకునే సంస్కృతికి తెలంగాణ పోలీస్ ఎప్పుడో తిలోదకాలు ఇచ్చిందని,సప్లై చైన్‌లోని చివరి క్రిమినల్ వరకు వేట కొనసాగుతోందని డీజీపీ ఉద్ఘాటించారు. **జాతీయ సగటు తుస్సు:** దేశవ్యాప్తంగా ప్రతి కేసుకు సగటున 1.3 మంది మాత్రమే అరెస్ట్ అవుతుంటే తెలంగాణ పోలీసులు ఏకంగా 3.7 మందిని కటకటాల వెనక్కి నెట్టి జాతీయ రికార్డులను తిరగరాశారు అని తెలిపారు. **సరిహద్దులు దాటి ఈగల్ విరుచుకుపాటు:** థాయిలాండ్, గోవా,ముంబయి కేంద్రాలుగా సాగుతున్న అంతర్జాతీయ,అంతర్రాష్ట్ర స్మగ్లింగ్ నెట్‌వర్క్‌ల గుండెల్లోకి చొరబడి మరీ డాన్‌లను ఈగల్ ఫోర్స్ అరెస్ట్ చేసింది అని ఆయన అన్నారు. **సాంకేతిక సమరం..ఆస్తుల ఊచకోత:** డార్క్ వెబ్‌పై సర్జికల్ స్ట్రైక్: సాంకేతికత ముసుగులో డార్క్ వెబ్ ద్వారా సాగే దందాను పసిగట్టి 500 కిలోలకు పైగా విషపూరిత డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుని 15కి పైగా ప్రొఫెషనల్ కేసులతో దెబ్బకొట్టారు అని అన్నారు. ఆస్తుల జప్తు సెక్షన్ 68ఎఫ్: డ్రగ్స్ ద్వారా సంపాదించిన ప్రతి పైసా అక్రమ ఆస్తిని ఎన్డిపిఎస్ చట్టం ప్రకారం సర్కార్ ఖాతాలో జమ చేస్తూ ఆర్థిక మూలాలను శాశ్వతంగా దెబ్బతీస్తున్నారు అని పేర్కొన్నారు. **యువత జోలికొస్తే సహించేది లేదు:** యువత, మైనర్ల భవిష్యత్తును నాశనం చేసే డ్రగ్స్ రాక్షసులను సమాజం నుంచి ఊడ్చిపారేస్తాం అని డీజీపీ హెచ్చరించారు.ప్రభుత్వం పోలీస్ రంగానికి ఇచ్చిన పూర్తి స్వేచ్ఛతో నూటికి నూరు శాతం నషాముక్తి తెలంగాణ సాధించి తీరుతాం అని డీజీపీ స్పష్టం చేశారు.ప్రతి పోలీస్ అధికారి ఇదే అంకితభావంతో పనిచేసి దేశానికి తెలంగాణను నెంబర్-1 ఆదర్శంగా నిలపాలి డీజీపీ సీవీ ఆనంద్ పిలుపునిచ్చారు.



# అదరగొట్టిన భారత కబడ్డీ జట్టు.. ఫైనల్స్‌కి దూసుకెళ్లింది..

ఐచి: ఆసియా క్రీడల్లో భారత పురుష, మహిళ కబడ్డీ జట్లు అదరగొడుతున్నాయి. ఇప్పటికే మహిళ జట్టు ఫైనల్స్‌కి దూసుకెళ్లగా.. తాజాగా పురుషుల జట్టు ఫైనల్స్‌కు చేరింది. శుక్రవారం ఐచి వేదికగా థాయ్‌లాండ్‌తో జరిగిన పోరులో ఘన విజయం సాధించి తుది పోరుకు చేరుకుంది. థాయ్‌లాండ్‌పై భారత్ 66–28 స్కోర్‌తో ఘన విజయం సాధించింది. దీంతో ఈ ప్రతిష్టాత్మక క్రీడల్లో భారత్‌కు మరో పతకం ఖాయమైంది. శనివారం జరిగే ఫైనల్ పోరులో భారత పురుషుల కబడ్డీ జట్టు తైవాన్ లేదా ఇరాన్‌తో తలపడే అవకాశముంది. అంతకు ముందు భారత మహిళల కబడ్డీ జట్టు కూడా సత్తా చాటింది. సెమీ ఫైనల్‌లో నేపాల్‌ను 48–24 తేడాతో భారత్ చిత్తు చేసింది. కాగా టోర్నమెంట్‌లో మెన్స్, ఉమెన్స్ కబడ్డీ జట్లు ఇప్పటివరకు ఒక్క మ్యాచ్‌లో కూడా ఓడిపోలేదు.

# ఆసియా క్రీడలు.. ఆఫ్ఘనిస్థాన్‌పై నేపాల్ ఘన విజయం

ఆసియా క్రీడల్లో భాగంగా శుక్రవారం అఫ్ఘానిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో నేపాల్ 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్గానిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 102 పరుగులు మాత్రమే చేసింది. అఫ్గాన్ బ్యాటింగ్‌లో ఫైజల్ ఖాన్ 30, నజీబుల్లా జద్రాన్ 30 మినహా మిగితా వాళ్లందరూ సింగిల్ డిజిట్ స్కోర్‌కే పరిమితమయ్యారు. నేపాల్ బౌలింగ్‌లో కౌషల్ భుర్టెల్ 4 వికెట్లు, లలిత్ రాజ్‌బాన్సీ 3 వికెట్లు



తీశారు. ఆ తర్వాత ఈ లక్ష్యాన్ని 17.2 ఓవర్లలో చేధించింది. నేపాల్ బ్యాటింగ్2లో సందీప్ జోరా 34, రోహిత్ పౌడెల్ 33(నాటౌట్) రాణించారు. అఫ్గాన్ బౌలింగ్‌లో ఫరిదూన్, అద్బొల్లా, అరబ్ గుల్ తలో వికెట్ తీశారు.

# విండీస్‌తో తొలి వన్డే.. సచిన్ రికార్డును కోహ్లీ బ్రేక్ చేస్తాడా?



వెస్టిండీస్ జట్టుతో ఆదివారం నుంచి టీం ఇండియా వన్డే సిరీస్‌లో తలపడనుంది. తొలి వన్డే తిరువనంతపురం వేదికగా జరగనుంది. ఇప్పటికే అక్కడకు చేరుకున్న భారత జట్టు ప్రాక్టీస్ ప్రారంభించింది. అయితే ఈ తొలి మ్యాచ్‌లో టీం ఇండియా పరుగుల రారాజు విరాట్ కోహ్లీ ఓ ప్రపంచ రికార్డును బ్రేక్ చేసే అవకాశం ఉంది. అది ప్రస్తుతం భారత దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ పేరిట ఉంది. తిరువనంతపురంలో జరిగే వన్డేలో కోహ్లీ మరో 59 పరుగులు చేస్తే.. అంతర్జాతీయ వన్డేల్లో అత్యంత వేగంగా 15,000 పరుగులు పూర్తి చేసుకున్న క్రికెటర్‌గా ప్రపంచ రికార్డు సృష్టిస్తాడు. విరాట్ ఇప్పటివరకూ 311 ఇన్నింగ్స్‌లో 14,941 పరుగులు చేశాడు. సచిన్ టెండూల్కర్ 377 ఇన్నింగ్స్‌లో ఈ మైలురాయి చేరుకున్నారు. మరోవైపు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ కూడా ఓ మైలురాయికి చేరువలో ఉన్నాడు. ఈ మ్యాచ్‌లో రోహిత్ 105 పరుగులు చేస్తే.. వన్డేల్లో 12,000 పరుగుల మైలురాయిని చేరుకుంటాడు. మరి విరాట్–రోహిత్ ఈ రికార్డులు సాధిస్తారో లేదో చూడాలి.

# ఆసియా క్రీడలు.. భారత్‌కు రెండో స్వర్ణ పతకం..



జపాన్‌లో ఆసియా క్రీడలు 2026 ఘనంగా జరుగుతున్నాయి. ఈ క్రీడల్లో తమ అత్యుత్తమ ప్రదర్శన కనబర్చడంలో అథ్లెట్లు పోటీ పడుతున్నారు. కాగా, ఇప్పటికే భారత్‌కు క్రికెట్‌లో స్వర్ణపతకం లభించిన విషయం తెలిసిందే. ఇప్పుడు మన దేశానికి మరో స్వర్ణ పతకం లభించింది. షూటింగ్ విభాగంలో తొలుత మను బాకర్ వంటి స్టార్ షూటర్లు నిరాశ పరిచినా.. ఇప్పుడు ఏకంగా గోల్డ్ మెడల్ దక్కింద. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవట?ంలో భారత షూటర్లు కమల్‌జీత్, సురుచి సింగ్ స్వర్ణం సాధించారు. దీంతో ఈ క్రీడల్లో భారత్‌కు రెండో పసిడి పతకం లభించింది. ఈ విభాగం మెడల్ రౌండ్‌లో మొత్తం నాలుగు జోడీలు ఫైనల్2కు అర్హత సాధించారు. ఇందులో కమల్‌జీత్, సురుచి కలిసి మొత్తంగా 484.6 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచారు. దక్షిణ కొరియా ద్వయానికి రజతం, ఇరాన్ జోడీకి కాంస్యం దక్కాయి.

# రజనీకాంత్ 'జైలర్-2' పాటకు డేవిడ్ వార్నర్ డ్యాన్స్ చేస్తే..



ఆసీస్ క్రికెటర్ డేవిడ్ వార్నర్ అంటే క్రికెట్ అభిమానులకే కాదు.. సినీ ప్రియులకు కూడా ఎంతో ఇష్టం. లాక్‌డౌన్ సమయంలో ఆయన పలు పాటలకు డ్యాన్స్‌లు చేస్తూ అప్‌లోడ్ చేసిన వీడియో ఎంతో వైరల్ అయ్యాడు. ఆ తర్వాత నుంచి వార్నర్‌ని డేవిడ్ భాయ్ అని పిలవడం ఫ్యాన్స్‌కి అలవాటు అయింది. గత ఏడాది నితిన్ హీరోగా వచ్చిన 'రాబిన్‌హుడ్' అనే సినిమాలో ఈ ప్రత్యేక పాత్రలో కనిపించారు వార్నర్. అయితే ఆ సినిమా ఊహించినంత సక్సెస్ సాధించలేదు.ఇప్పుడు డేవిడ్ వార్నర్ మరో వీడియోతో ఫ్యాన్స్ ముందుకొచ్చారు. 'జైలర్–2' చిత్రంలోని 'అల బోలేలో' పాటకి వార్నర్ డ్యాన్స్ చేస్తే ఎలా ఉంటుందో అనేలా ఓ ఎఐ వీడియోని క్రియేట్ చేశారు. దీన్ని వార్నర్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. "ఇది ఎవరు చేశారో నాకు తెలీదు.. కానీ, నా డ్యాన్స్‌కు ఎన్ని మార్కులు ఇస్తారు' అని క్యాప్షన్ పెట్టాడు. దీనిపై అభిమానులు రకరకాలుగా కామెంట్లు చేస్తున్నారు.




# మన్‌ప్రీత్ కౌర్‌కు కాంస్యం

–హైదరాబాద్: ఆసియా క్రీడల్లో మహిళల షాట్ పుట్ విభాగంలో భారత్‌కు చెందిన మన్‌ప్రీత్ కౌర్ కాంస్య పతకాన్ని గెలుచుకుంది. మన్‌ప్రీత్ తన నాల్గో ప్రయత్నంలో 17.17 మీటర్ల అత్యుత్తమ దూరాన్ని నమోదు చేసి పతకాన్ని ఖరారు చేసుకున్నారు. చైనాకు చెందిన సాంగ్ జియాయువాన్ 19.40 మీటర్ల ప్రదర్శనతో స్వర్ణాన్ని, అదే దేశానికి చెందిన జాంగ్ లిన్‌రు 18.14 మీటర్లతో రజతాన్ని కైవసం చేసుకున్నారు. ఇదే ఈవెంట్‌లో మరో భారత క్రీడాకారిణి కృష్ణ జయశంకర్ మీనన్ ఐదవ స్థానంలో నిలిచారు.

# తొలి రౌండ్‌లోనే సాత్విక్-చిరాగ్ ఓటమి

హైదరాబాద్: ఆసియా క్రీడల పురుషుల డబుల్స్ బ్యాడ్మింటన్ విభాగంలో డిఫెండింగ్ ఛాంపియన్స్ సాత్విక్‌సాయిరాజ్ రెడ్డి చిరాగ్ శెట్టి తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో థాయిలాండ్‌కు చెందిన సుక్‌ఫున్, పక్కపోన్ టీరారత్సాకుల్ జోడీ చేతిలో ఓడిపోయారు. ఊహించని విధంగా నాలుగో సీడ్ హోదాలో బరిలోకి దిగిన ఈ భారత జోడీ, 21–12, 19–21, 14–21 తేడాతో ఓటమిని చవిచూసింది.





# ఆసియా క్రీడల్లో భారత్‌కు మరో స్వర్ణం

హైదరాబాద్ : ఐచీ–నగోయా ఆసియా గేమ్స్‌లో ఆరో రోజు భారత్‌కు అద్భుతమైన ఆరంభం లభించింది. షూటర్లు సత్తా చాటడంతో భారత్ ఖాతాలో ఒక స్వర్ణం, ఒక రజతం చేరాయి. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఫైనల్‌లో సురుచి, కమల్‌జీత్ జోడీ పసిడి పతకాన్ని ముద్దాడింది. పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ టీమ్ ఈవెంట్‌లో ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్, నీరజ్ కుమార్, రుద్రాంక్ష్ పాటిల్‌తో కూడిన జట్టు రజత పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ విజయంతో దేశ పతకాల సంఖ్య 19కి చేరింది. మరోవైపు, స్వర్ణం గెలిచిన సురుచి–కమల్‌జీత్ జోడీ, క్వాలిఫికేషన్ రౌండ్‌లో ఆసియా రికార్డును సమం చేయడం విశేషం



# అప్పుడు కాంస్యం.. ఇప్పుడు రజతం.. మారథాన్‌లో మళ్లీ మెరిసిన గుల్వీర్..!


జపాన్‌లోని నగోయలో జరుగుతున్న ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు మెరుస్తున్నారు. పురుషుల100 మీటర్ల పరుగులో గురిందెర్వీర్ సింగ్, అనిమేశ్ కుజుర్‌లు నిరాశపరిచినా.. 'నేనున్నాంటూ' మారథాన్ పరుగులో గుల్వీర్ సింగ్ పతకంతో మెరిశాడు. 10 వేల మీటర్లలో సత్తా చాటిన గుల్వీర్ రెండో స్థానంలో నిలిచి దేశానికి సిల్వర్ మెడల్ అందించాడు. దాంతో.. ఆసియాడ్‌లో వరసగా రెండో పతకం ఖాతాలో వేసుకున్నాడీ రన్నర్. 2023లో హంగ్జూలో గుల్వీర్ కాంస్యం సాధించాడు.పద్దెనిమిదో ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్ గుల్వీర్ సింగ్ వెండి వెలుగులు విరజిమ్మాడు. పురుషుల 10 వేల మీటర్ల పరుగులో అసమాన పట్టుదలను ప్రదర్శించిన అతడు సిల్వర్ మెడల్ సాధించాడు. ఆసియాడ్ వంటి పెద్ద వేదికలపై నేను ఎప్పుడూ నిరాశపరచను అని చాటుతూ పోడియం మీద సగర్వంగా నిలబడ్డాడీ రన్నర్. శుక్రవారం జరిగిన పురుషుల 10 వేల మీటర్ల పరుగులో గుల్వీర్ 28:29.38 నిమిషాల్లో లక్ష్యాన్ని చేరుకున్నాడు. అతడి కంటే 1.87 సెకన్ల ముందుగా పరుగు పూర్తి చేసిన బిర్హాను బలెవ్(బహ్రెయిన్) స్వర్ణం ఎగరేసుకుపోయాడు.

# ‘ది ప్యారడైజ్’లో కయాదు లోహర్ పాత్రపై విమర్శలు.. శ్రీకాంత్ ఓదెలకి నెటిజన్ల ప్రశ్నలు



నేచురల్ స్టార్ నాని నటించిన ‘ది ప్యారడైజ్’కు విడుదల తర్వాత మిశ్రమ స్పందన వస్తోంది. సినిమా కథ, నాని నటన, యాక్షన్ సన్నివేశాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నప్పటికీ.. ఈ చిత్రంలో కయాదు లోహర్ పోషించిన సుబ్బు పాత్ర మాత్రం ప్రత్యేకంగా చర్చకు వచ్చింది. ముఖ్యంగా ఆ పాత్రను దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కించిన విధానంపై సోషల్ మీడియాలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సినిమాలో సుబ్బు పాత్రకు సినీ నటి కావాలనే కోరిక ఉంటుంది. తల్లి వద్దని వారించినా మద్రాస్ వెళ్లి సినిమాల్లో అవకాశాల కోసం ప్రయత్నిస్తుంది. అయితే అనుకున్న స్థాయిలో అవకాశాలు రాకపోవడంతో తీవ్ర నిరాశకు గురవుతుంది. అదే సమయంలో తన తండ్రి చేసిన అప్పుల కారణంగా కుటుంబం ఎదుర్కొంటున్న అవమానాలను చూస్తుంది. ఎలాగైనా ఆ అప్పులు తీర్చాలని నిర్ణయించుకున్న సుబ్బు.. డబ్బు కోసం బీ గ్రేడ్ చిత్రాల్లో నటించడం ప్రారంభిస్తుంది.ఇక్కడే ‘ది ప్యారడైజ్’లోని కొన్ని సన్నివేశాలపై ప్రేక్షకుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. సుబ్బు నటించే బీ గ్రేడ్ చిత్రాలకు ‘చుక్క చిత్రాలు’ అనే పేరు పెట్టడం, వాటిని ప్రదర్శించే సన్నివేశాల్లో హీరోయిన్ పాత్రను చూపించిన తీరు అవసరానికి మించి గ్లామర్‌ను ప్రధానంగా చూపించిందని కొందరు ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. కథలో ఆ పాత్ర ఎదుర్కొంటున్న బాధ, పరిస్థితుల తీవ్రత ప్రేక్షకులకు బలంగా కనెక్ట్ కావాల్సిన చోట.. కొన్ని సన్నివేశాలు వేరే విధంగా స్పందన తెచ్చుకున్నాయని సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. మరోవైపు సుబ్బు నడుముపై ఉండే సీతాకోకచిలుక టాటూ కూడా కథలో కీలకంగా ఉపయోగించారు. బీ గ్రేడ్ చిత్రాల్లో ఆమె ముఖాన్ని చూపించకుండా ఆ టాటూ ద్వారా గుర్తుపట్టేలా సన్నివేశాలను రూపొందించారు. అయితే ఆ విషయాన్ని హీరో తెలుసుకున్న తర్వాత వచ్చే సన్నివేశంలో నాని చెప్పే కొన్ని సంభాషణలపైనా విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా మహిళలను అవమానించేలా అనిపించే పదజాలాన్ని ఉపయోగించడంపై కొందరు ప్రేక్షకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.వాస్తవానికి సుబ్బు పాత్ర వెనుక ఉన్న ఉద్దేశం భావోద్వేగంగా ప్రేక్షకులను కదిలించడమే అయి ఉండొచ్చనే అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి. కుటుంబ అప్పులు తీర్చడానికి ఒక యువతి తనకు ఇష్టం లేని మార్గంలోకి వెళ్లాల్సి రావడం, ఆ తర్వాత ఆ విషయం హీరోకు తెలియడం వంటి అంశాలతో బలమైన భావోద్వేగాన్ని పండించాలని దర్శకుడు ప్రయత్నించినట్లు కనిపిస్తోంది. అయితే ఆ సన్నివేశాల చిత్రీకరణ కారణంగా ఆశించిన భావోద్వేగం కంటే భిన్నమైన స్పందన వచ్చిందని కొందరు ప్రేక్షకులు అంటున్నారు. సోషల్ మీడియాలో కొంతమంది కయాదు లోహర్ సన్నివేశాలనే సినిమాకు సంబంధించిన చర్చలో ప్రధాన అంశంగా మార్చుకుని ట్రోల్ చేస్తున్నారు. మరికొందరు మాత్రం ఆ పాత్రను విమర్శించాల్సిన అవసరం లేదని, పాత్రను ఎలా రాశారు, ఎలా చూపించారు అనే అంశంపైనే చర్చ జరగాలని అంటున్నారు. అంటే.. విమర్శల ప్రధాన కేంద్రం కయాదు లోహర్ కాదు, ఆమె పాత్రను తెరపై ఆవిష్కరించిన విధానమే అన్నది వారి అభిప్రాయం.

# ‘పార్కింగ్’ దర్శకుడితో శివకార్తికేయన్ కొత్త సినిమా.. పూజా కార్యక్రమాలతో లాంచ్!




కోలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొన్నాయి. శివకార్తికేయన్ తన తదుపరి సినిమాలతో పాటు ఈ ‘ఎస్కే27’ షూటింగ్ షెడ్యూల్స్‌ను కూడా బ్యాలెన్స్ చేయనున్నారు.కోలీవుడ్ టాలెంటెడ్ హీరో శివకార్తికేయన్ (ాఱఙఝఞఖతీ్ఖ్తఱఅవఝఱఅ) హీరోగా తెరకెక్కుతున్న తాజా సినిమా ‘ఎస్కే27’ అధికారికంగా ప్రారంభమైంది. ప్రముఖ నిర్మాణ సంస్థ సత్యజ్యోతి ఫిలింస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. విమర్శకుల ప్రశంసలు పొందిన ‘పార్కింగ్’ (ఖఱతీఎఱఅస్త్ర) చిత్రంతో జాతీయ అవార్డును గెలుచుకున్న టాలెంటెడ్ డైరెక్టర్ రామ్‌కుమార్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ప్రొడక్షన్ పనులు గ్రాండ్‌గా మొదలయ్యాయి. ఈ చిత్రంలో శివకార్తికేయన్ సరసన కయాదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, యువ సంగీత సంచలనం సాయి అభ్యాంకర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నట్లు సమాచారం. పర్ఫెక్ట్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ ప్రాజెక్ట్‌పై

# తెలుగులోకి ‘హనుమాన్ అన్ష్’.. త్రివిక్రమ్ తప్పుకోవడంతో ఇప్పుడు హోంబళే ఫిల్మ్స్ ఎంట్రీ?




హిందీ చిత్ర పరిశ్రమలో భక్తి ప్రధాన కథాంశంతో రూపొందిన కొన్ని సినిమాలు ఇటీవల భారీ విజయాలను అందుకుంటున్నాయి. అదే బాటలో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ‘హనుమాన్ అన్ష్’ కూడా మంచి ఆదరణను సొంతం చేసుకుంటూ వసూళ్ల పరంగా దూసుకెళ్తున్నట్లు సమాచారం. భక్తి, పురాణ నేపథ్య అంశాలను ఆసక్తికరంగా మేళవించిన ఈ సినిమాపై ఉత్తరాది ప్రేక్షకుల్లో మంచి స్పందన కనిపించడంతో.. ఇప్పుడు దక్షిణాది భాషల్లోనూ విడుదల చేసే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా తెలుగు ప్రేక్షకులకు ఈ సినిమాను అందించేందుకు తొలుత ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ముందుకు వచ్చినట్లు వార్తలు వచ్చాయి.సినిమాకు తెలుగు డబ్బింగ్ వెర్షన్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడంలో ఆయన భాగస్వామ్యం ఉండబోతుందని ప్రచారం జరిగింది. దీంతో తెలుగు ప్రేక్షకుల్లోనూ ఈ చిత్రంపై ఆసక్తి ఏర్పడింది. అయితే విడుదలకు కొన్ని రోజుల ముందు అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. కొన్ని కారణాల వల్ల త్రివిక్రమ్ ఈ సినిమా తెలుగు విడుదల వ్యవహారం నుంచి తప్పుకున్నారని ప్రచారం మొదలైంది. దీంతో అసలు ‘హనుమాన్ అన్ష్’ తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తుందా లేదా అనే సందేహాలు కూడా వ్యక్తమయ్యాయి.ఇప్పుడు తాజాగా ఈ సినిమాకు సంబంధించి మరో ఆసక్తికరమైన వార్త సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. దక్షిణాది ప్రేక్షకులకు సినిమాలను పరిచయం చేయడంలో ముందుండే ప్రముఖ నిర్మాణ సంస్థ హోంబళే ఫిల్మ్స్ ‘హనుమాన్ అన్ష్’ తెలుగు సహా దక్షిణాది భాషల విడుదల బాధ్యతలను తీసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నట్లు సమాచారం.అయితే దీనిపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. హోంబళే ఫిల్మ్స్ ఈ సినిమాను దక్షిణాదిలో విడుదల చేస్తుందనే వార్త ప్రస్తుతం పరిశ్రమ వర్గాల్లో వినిపిస్తున్న ప్రచారం మాత్రమే. సంస్థ నుంచి అధికారికంగా ప్రకటన వచ్చిన తర్వాతే దీనిపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. హోంబళే ఫిల్మ్స్‌కు భక్తి చిత్రాల విషయంలో ఇప్పటికే అనుభవం ఉంది. ఇటీవల హిందీ నుంచి వచ్చిన ‘మహావతార్ నరసింహ’ చిత్రాన్ని కూడా దక్షిణాది ప్రేక్షకులకు చేరువ చేయడంలో సంస్థ కీలకంగా వ్యవహరించింది. ఆ సినిమా కూడా పురాణ, భక్తి నేపథ్యంతో తెరకెక్కినదే కావడంతో.. ఇప్పుడు ‘హనుమాన్ అన్ష్’ విషయంలోనూ ఇదే సంస్థ పేరు వినిపించడం ఆసక్తిని పెంచుతోంది. ఒకవేళ హోంబళే ఫిల్మ్స్ ఈ చిత్రాన్ని అధికారికంగా తీసుకుంటే.. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేసే అవకాశాలు ఉండొచ్చనే చర్చ జరుగుతోంది. ఇప్పటికే హిందీలో ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందన దక్షిణాదిలోనూ సినిమాకు ఉపయోగపడుతుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

# మీ ప్రేమతో పాటు.. ట్రోల్స్‌ను కూడా స్వీకరిస్తున్నా: నాని



నాని హీరోగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘ది ప్యారడైజ్’. గురువారం (సెప్టెంబర్ 24న) విడుదలైన ఈ సినిమాకి మిక్సడ్ టాక్ వచ్చింది. కొంతమంది సినిమా బాగుందని చెబుతుంటే.. కొంతమంది తమకు నచ్చలేదని అంటున్నారు. అయితే సినిమాపై వచ్చిన రివ్యూలపై నాని స్పందించారు. సినిమాపై చూపిస్తున్న ప్రేమ, విమర్శలు రెండింటినీ స్వాగతిస్తున్నానని అన్నారు. “ది ప్యారడైజ్‌పై అభిప్రాయాలు, స్పందన అన్నింటినీ చూశా. మీరు చూపించిన ప్రేమతో పాటు, సరదా ట్రోల్స్‌ను కూడా స్వీకరిస్తున్నా. దీనిని తమ సినిమాగా ప్రేక్షకులు స్వీకరించిన తీరు నా హృదయానికి హత్తుకుంది. అదే సమయంలో సినీ విమర్శకులు, రివ్యూవర్లు ఎత్తి చూపిన పొరపాట్లు, లోటుపాట్లను పరిగణనలోకి తీసుకుంటాను. మీ అందరికీ కృతజ్ఞతలు. మీకు ప్రత్యేకమైన అనుభూతిని అందించాలనే ఉద్దేశంతో రక్తం, చెమట చిందించి #TheParadise తీర్చిదిద్దాం. మీరు దీన్ని సంబరంగా చేసుకోవచ్చు. విమర్శించవచ్చు. సినిమాపై మీరు చూపించిన ఉత్సాహం, నాపై కురిపించిన ప్రేమ, ఆప్యాయతకు నాలో కృతజ్ఞత భావాన్ని నింపాయి” అని నాని ఎక్స్‌లో పోస్ట్ చేశారు.కాగా, భారీ అంచనాల నడుమ విడుదలైన ప్యారడైజ్ చిత్రం తొలిరోజు ప్రపంచవ్యాప్తంగా రూ.88 కోట్లు వసూళ్లు చేసినట్లు చిత్ర బృందం తెలిపింది. నాని కెరీర్‌లోనే ఇవి రికార్డుస్థాయి కలెక్షన్స్ అని వెల్లడించింది.

# సైలెంట్‌గా ఒటిటిలోకి వచ్చేసిన సూపర్ హిట్ సినిమా

కొన్ని సినిమాలు ఎటువంటి అంచనాలు లేకుండా విడుదలై.. సూపర్ హిట్‌గా నిలుస్తాయి. అలా వచ్చిన సినిమానే ఇమ్రాన్ హష్మి హీరోగా నటించిన ‘ఆవారాపన్-2’. 2007లో వచ్చిన ‘ఆవారాపన్’ సినిమాకి ఇది సీక్వెల్. మొదటి భాగం సినిమాని ప్రేక్షకులు థియేటర్లలో అంతగా పట్టించుకోలేదు. కానీ, ఆ తర్వాత టివిల్లో చూసి సినిమాని ఇష్టపడ్డారు. దీంతో ఆ సినిమా సీక్వెల్‌పై ఎన్నో అంచనాలు ఏర్పడ్డాయి. అనుకున్నట్లుగానే ‘ఆవారాపన్-2’ గత నెల 14న థియేటర్లలోకి వచ్చి బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. రూ.45 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా రూ.213 కోట్ల వసూళ్లు సాధించింది. అయితే ఇప్పుడు ఈ సినిమా సైలెంట్‌గా ఒటిటిలోకి వచ్చేసింది. అమెజాన్ ప్రైమ్‌లో అద్దె విధానంలో అందుబాటులోకి వచ్చింది. త్వరలో ఉచితంగానూ స్ట్రీమింగ్‌లోకి రావచ్చు. హిందీలో మాత్రమే ఇది అందుబాటులో ఉంది.



# ‘అనుమాన పక్షి’ రివ్యూ.. విమల్ కృష్ణ టేకింగ్, రాగ్ మయూర్ నటన ఎలా ఉంది!




డిజె టిల్లు’ వంటి సెన్సేషనల్ బ్లాక్‌బస్టర్ తర్వాత దర్శకుడు విమల్ కృష్ణ తెరకెక్కించిన తాజా చిత్రం ‘అనుమాన పక్షి’. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా కథాకథనాలు ఎలా ఉన్నాయో సమీక్షలో చూద్దాం.కథేంటంటే: సన్నీ (రాగ్ మయూర్) ‘అనుమాన పక్షి’ పేరుతో ఓ యూట్యూబ్ ఛానెల్ నడుపుతుంటాడు. ప్రతి విషయాన్ని అతిగా ఆలోచించడం, అందరినీ అనుమానించడం అతని నైజం. ఈ క్రమంలో తన స్నేహితుడు అనంతు డిప్రెషన్‌లో ఉన్నానని, కాశ్మీర్‌లో ఆత్మహత్య చేసుకుంటానని ఫోన్ చేస్తాడు. దాంతో సన్నీ, రమ్య అనే అమ్మాయిని ఇష్టపడే వర్మ (ప్రిన్స్) సహాయంతో కాశ్మీర్ బయలుదేరుతాడు. అక్కడ కన్య (మెరిన్ ఫిలిప్) పరిచయమవ్వడం, అనుకోకుండా వర్మ హత్యకు గురికావడం, రీల్స్ చేయడానికి పిచ్చిగా ప్రయత్నించే పోలీస్ ఆఫీసర్ వాసు (అజయ్) ఎంట్రీ ఇవ్వడం జరుగుతుంది. వీరందరి మధ్య సంబంధం ఏమిటి? ఈ చిక్కుముడిని సన్నీ ఎలా విప్పాడు? అనేదే ఈ చిత్ర అసలు కథ.విశ్లేషణ: దర్శకుడు విమల్ కృష్ణ ఎంచుకున్న పాయింట్ చాలా కొత్తగా ఉంది. ప్రతి చిన్న విషయానికి అనుమానపడే హీరో పాత్ర చుట్టూ తిరిగే సన్నివేశాలు విభిన్నంగా నవ్విస్తాయి. ప్రథమార్ధంలో హీరో చేసే అల్లరి, సిచ్యుయేషనల్ కామెడీ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ఇక ద్వితీయార్ధంలో అజయ్ పోలీస్ ఆఫీసర్‌గా చేసిన హంగామా, రీల్స్ కాన్సెప్ట్ ప్రస్తుత ట్రెండ్‌కు తగ్గట్టుగా సరదాగా సాగుతాయి. స్క్రీన్‌ప్లేలో సస్పెన్స్ ఎలిమెంట్స్ సినిమాపై ఆసక్తిని కలిగిస్తాయి.నటీనటుల ప్రతిభ: లీడ్ రోల్ చేసిన రాగ్ మయూర్ తన అనుమానాలతో కూడిన పాత్రలో చాలా సహజంగా నటించాడు.